# బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం, 14 మే-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## పుదుచ్చేరి సిఎంగా రంగస్వామి ప్రమాణం



## సిఎం రేవంత్‌ను కలిసిన పలువురు ప్రముఖులు



హైదరాబాద్,మే13 : ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో పలువురు ప్రముఖులు కలిశారు. వీరంతా సిఎంను మర్యాదపూర్వకంగా కలిసారు. లోకాయుక్త జస్టిస్ రాజశేఖర్ రెడ్డి, ఇంజనీరింగ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ రీజినల్ చైర్మన్ రామన్ రఘు , రీజనల్ డైరెక్టర్ జె.వి.రాజగోపాల్ రావు, సైనిక్ సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ ఎన్.ఆర్.బాబులుఉన్నారు.

# రైతుల ఖాతాల్లోకి రూ.4,520 కోట్లు

- 30 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు
- పౌరరఫరాల శాఖ అధికారుల వెల్లడి



హైదరాబాద్,మే13 : 2025-26 రబీ సీజన్‌లో వరి ధాన్యం కొనుగోళ్లను సజావుగా మరియు సమర్థవంతంగా నిర్వహించేందుకు పౌరసరఫరాల శాఖ పూర్తి సామర్థ్యంతో పనిచేస్తోంది. ఇప్పటి వరకు విజయవంతంగా 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, మార్గదర్శకత్వంలో, రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఎలాంటి జాప్యం లేకుండా కనీస మద్దతు ధర కింద రూ. 4,520 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసింది. ల్గ÷తులు సన్న మరియు దొడ్డు రకాల ధాన్యాన్ని భారీగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 9 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయగా, మిగిలిన 21 లక్షల మెట్రిక్ టన్నుల మేర దొడ్డురకం ధాన్యాన్ని సేకరించడం జరిగింది. ÷-రస్తుతం ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో, భారీగా వస్తున్న ధాన్యాన్ని సేకరించేందుకు అన్ని జిల్లాల్లో కలిపి మొత్తం 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు చురుగ్గా పనిచేస్తున్నాయి. ఈ విస్తృతమైన క్షేత్రస్థాయి వ్యవస్థలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 4,350 కేంద్రాలు, ఐకేపీ ఆధ్వర్యంలో 3,563 కేంద్రాలు, మరియు ఇతర అనుబంధ సంస్థల ద్వారా 662 కేంద్రాలు నడుపబడుతున్నాయి. కొనుగోలు కార్యకలాపాలు సజావుగా సాగడానికి మరియు కేంద్రాలకు వస్తున్న ధాన్యాన్ని పూర్తిగా సంరక్షించడానికి, పౌరసరఫరాల శాఖ ముందస్తుగానే ఈ కేంద్రాల వద్ద 18.6 కోట్ల గన్నీ బ్యాగ్‌లను మరియు తగిన సంఖ్యలో టార్పాలిన్లను సిద్ధంగా ఉంచింది. క్షేత్రస్థాయిలో నిల్వల సమస్య తలెత్తకుండా మరియు కొనుగోలు కేంద్రాలు ప్రతిరోజూ కొత్త ధాన్యాన్ని స్వీకరించడానికి సిద్ధంగా ఉండేలా, పౌరసరఫరాల శాఖ వేగవంతమైన రవాణా కార్యకలాపాలను అమలు చేస్తోంది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని జాప్యం లేకుండా నేరుగా కేంద్రాల నుండి మిల్లులకు తరలించడానికి లారీలు, ట్రాక్టర్లు, డీసీఎంలతో కూడిన సుమారు 11,500 రవాణా వాహనాలను అందుబాటులో ఉంచింది. అంతేకాకుండా, లోడింగ్ మరియు మిగతా 3లో..

# నీట్ పేపర్ లీక్‌లో సిబిఐ దూకుడు



- దేశంలో ఏకకాలంలో సోదాలు
- ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ప్రకటన

న్యూఢిల్లీ,మే13 : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సీబీఐ అధికారులు దర్యాప్తులో కీలక మలుపు చోటుచేసుకుంది. నీట్ యూజీ-2026 పేపర్ లీక్ కేసులో సీబీఐ తన దర్యాప్తును మరింత వేగవంతం చేసింది. ఈ కేసులో ఇప్పటి వరకు ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు సీబీఐ అధికారికంగా ప్రకటించింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఒకేసారి సోదాలు నిర్వహి స్తోంది. ఈ లీకేజ్ వెనుక ఉన్న ప్రధాన ముఠాను బయటకు తీసుకురావడానికి అధికారులు కృషి చేస్తున్నారు. నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన కలిగించింది. ఈ నేపథ్యంలో సీబీఐ ప్రత్యేక బృందాలు రాజస్థాన్, హరియాణా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాయి. సోదాల సమయంలో అనేక ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, డాక్యుమెంట్లు, బ్యాంక్ లావాదేవీలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సీబీఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ కేసులో ప్రశ్నాపత్రం లీక్, మధ్యవర్తుల వ్యవస్థ, భారీ మొత్తాల్లో డబ్బుల లావాదేవీలు జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయి. మిగతా 3లో..

## విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్



- తమిళనాడు అసెంబ్లీలో 144 మంది మద్దతు
- విశ్వాస పరీక్షను బహిష్కరించిన డీఎంకె
- అనాడిఎంకె చీలిక వర్గం టివికెకు అనుకూల ఓటు
- ప్రజల విశ్వాసాన్ని కాపాడుకుంటామన్న సిఎం విజయ్ మిగతా 3లో..

## క్రైమ్‌లో తెలంగాణ రైజింగ్

- వెల్‌డన్ రాహుల్ గాంధీ అంటూ.. కెటిఆర్ ట్వీట్



మిగతా 3లో..

# పొదుపు సూత్రాలు తెలంగాణకు

- నిధులు మాత్రం ఆంధ్రాకా ..?
- ప్రధాని తీరుపై మండిపడ్డ కవిత
- భగీరథ్ పారిపోకుండా లుకౌట్ నోటీసులు ఇవ్వాలని డిమాండ్



హైదరాబాద్,మే13 : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి పొదుపు సూత్రాలు చెప్పారని.. డబ్బులు మాత్రం ఏపీకి ఇచ్చారని తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యానిం చారు. బుధవారం మీడియాతో కవిత మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని.. ప్రధాని సభా వేదికను బండి సం జయ్ పంచుకోకుంటే బాగుండేదని అన్నారు. ప్రధాని పర్యటనలో కేంద్ర మంత్రి పాల్గొనడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతం వెళ్లిందన్నారు. బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా తెలంగాణ పోలీ సులు లుకౌట్ నోటీసులు జారీ చే యాలని కవిత అన్నారు. బండి సం జయ్ కుమారుడు తప్పు చేసినట్లు రుజువు అయితే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా మిగతా 3లో..

## గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్య




మెదక్,మే13 : మెదక్ జిల్లా శివంపేట మండలం శభాష్‌పల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని ఓ వ్యక్తిని హత్య చేసి పడేయడంతో స్థానికంగా కలకలం రేగింది. బుధవారం ఉదయం అటుగా వెళ్లిన పలువురు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తూప్రాన్ సీఐ వెంకట రాజా గౌడ్, స్థానిక ఎస్ఐ మధుకర్ రెడ్డి అక్కడికి చేరుకొని పరిశీలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ ఘట్‌కేసర్ మండలం అంకుశాపూర్ గ్రామానికి చెందిన ఎండీ అన్వర్ (50) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అతడిని హత్య చేసి శభాష్‌పల్లి గ్రామ శివారులో పడేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మిగతా 3లో..

## బక్రీద్ సందర్భంగా ప్రత్యేక చర్యలు



- పశువుల అక్రమ రవాణాపై నిఘా
- రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 203 చెక్ పోస్టుల ఏర్పాటు
- ఘర్షణలు తలెత్తకుండా కఠిన చర్యలకు ఆదేశం
- అధికారులతో డిజిపి సివి ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్

మిగతా 2లో..

# బండి భగీరథ్ అరెస్ట్ తప్పదు

- ఆయనను రక్షించాల్సిన అవసరం మాకేముంది
- మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్



హైదరాబాద్,మే13:పోక్సో కేసులో ఆరోపణలు రాగానే అరెస్ట్ చేయాలని.. చట్టం ప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు తప్పవని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను తప్పకుండా అరెస్ట్ చేస్తారని తెలిపారు. బండి సంజయ్ కొడుకు పరారీలో ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిఖార్సైన కాంగ్రెస్ లీడర్ అని చెప్పుకొచ్చారు. బండి సంజయ్ కుమారుడి కేసులో ఎలాంటి జాప్యం లేదని వెల్లడించారు. పోక్సో చట్టం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. బండి భగీరథ్‌ను తప్పించే అవసరం తమకు లేదన్నారు. భగీరథ్ విదేశాలకు వెళ్లారని అనుకోవడం లేదని అన్నారు. మోదీని ప్రధాన మంత్రిగా మాత్రమే చూస్తామని పీసీసీ చీఫ్ అన్నారు. ప్రధాని మోదీ ఏదో ఇస్తారని అనుకుంటే ఏమీ ఇవ్వలేదని విమ ర్శించారు. బీజేపీలో అంతర్గత కుమ్ములా టలు ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ కంటే బీజేపీలో ఎక్కువ గ్రూపు తగాదాలు ఉన్నాయన్నారు. బండి భగీరథ్ కేసులో బాధితురాలికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ వెనుకంజ వేయదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో విజయలక్ష్మికి మహిళా కమిషన్ చైర్మన్ పదవి ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు. ఎవరికి వారు తెలంగాణ జాతిపిత అనుకుంటే ఎలా.. జాతిపిత అనే బిరుదు ప్రజలు మిగతా 3లో..


# తప్పు చేస్తే ఎంతటివారైనా శిక్షార్హులే

- బండి భగీరథ్ విషయంలో వెనకడుగు లేదు
- మంత్రి సీతక్క స్పష్టీకరణ



మహబూబాబాద్,మే13: భగీరథ్ కేసులో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా తాత్సారం చేయలేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే పోక్సో కేసు నమోదు చేశామని వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన కారణంగా కేసు నమోదు చేయడంలో ఒక్క రోజు ఆలస్యం జరిగిన మాట వాస్తవమేనని మంత్రి సీతక్క ఒప్పుకున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్‌కు సంబంధించిన కేసు వివాదంపై మంత్రి సీతక్క స్పందించారు. కేంద్ర మంత్రి అయినా, ప్రధానమంత్రి అయినా తప్పు చేస్తే శిక్ష పడాల్సిందేనని అన్నారు. ఈ కేసులో సిట్ ఏర్పాటు చేయడం కాలయాపన కోసం కాదని, నిజానిజాలు వెలికితీయడానికేనని పేర్కొన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు ఎంతటి వారైనా పోలీసుల విచారణకు హాజరు కావాల్సిందేనని మంత్రి స్పష్టం చేశారు. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాలు మహిళలను గౌరవించాలని, ప్రజలను ప్రేమించాలని ఈ సందర్భంగా సీతక్క విజ్ఞప్తి చేశారు. బాలికపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయ్యింది. అప్పటి నుంచి అతను పరారీలో ఉన్నట్లు సమాచారం. బుధవారం పోలీసుల ఎదుట భగీరథ్ హాజరుకావాల్సి ఉంది. అయితే, వ్యక్తిగత కారణాల దృష్ట్యా ఈ నెల 15వ తేదీన విచారణకు హాజరవుతానని పేర్కొంటూ పేట్ బషీరాబాద్ పోలీసులకు, సిట్ అధికారులకు ఈ-మెయిల్‌తోపాటుభగీరథ్ లేఖ పంపించారు.

## బీజింగ్ చేరుకున్న ట్రంప్



- 9 ఏళ్ల తరవాత మళ్లీ చైనా పర్యటన

మిగతా 3లో..

# ఎయిర్ ఇండియా సంచలన నిర్ణయం

- పలు అంతర్జాతీయ సర్వీసులు నిలిపివేత



న్యూఢిల్లీ,మే13 : ఎయిర్ ఇండియా విమానయాన సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పలు అంతర్జాతీయ విమాన సర్వీసులను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఇంధన ధరల పెరుగుదల, గగనతల ఆంక్షల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు మొత్తం ఆరు ప్రధాన అంతర్జాతీయ మార్గాల్లో విమానాలను నిలిపివేస్తున్నట్లు ఓ ప్రకటన జారీ చేసింది. ఢిల్లీ-చికాగో, ముంబై-న్యూయార్క్, ఢిల్లీ-షాంఘై, చెన్నై-సింగపూర్, ముంబై-ఢాకా, ఢిల్లీ-మాలే రూట్లలో సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. ఈ నిర్ణయం జూన్ నుంచి ఆగస్టు మధ్యకాలంలో అమలులో ఉంటుందని తెలిపింది.నష్టాల దృష్ట్యా ఇప్పటికే కొన్ని మార్గాల్లో సర్వీసులను ఎయిర్ ఇండియా తగ్గించింది. ఆ నిర్ణయాన్ని మరికొన్ని రూట్లకు విస్తరిస్తూ తాజాగా ప్రకటన జారీ చేసింది. దీని ప్రకారం ఎయిర్ ఇండియా సంస్థ ప్రతి నెలా 1,200కు పైగా అంతర్జాతీయ విమాన సర్వీసులను నడపనుంది. వీటిలో ఉత్తర మిగతా 3లో..

## నీట్‌ను పూర్తిగా రద్దు చేయాలి

- తమిళనాడు సిఎం విజయ్ డిమాండ్

చెన్నై,మే13 : దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే 'జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష-యూజీ'ని (నీట్-యూజీ) మొత్తానికే రద్దు చేయాలని తమిళనాడు సీఎం విజయ్ డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ కావడం, పరీక్ష రద్దు వంటివి.. వ్యవస్థాగత లోపాలకు నిదర్శనమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొదటినుంచి నీట్‌ను తమిళనాడు వ్యతిరేకించిన అంశాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ పరీక్షతో గ్రామీణ ప్రాంతాలు, ప్రభుత్వ పాఠశాలలు, తమిళ మాధ్యమానికి చెందిన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో 12వ తరగతి మార్కుల ఆధారంగా సీట్లను భర్తీ చేసేందుకు రాష్ట్రాలకు అనుమతి ఇవ్వాలని కేంద్రానికి సీఎం విజయ్ విజ్ఞప్తి చేశారు. నీట్ రద్దు చేయడం ద్వారా రాష్ట్రాలకు స్వేచ్ఛ ఇవ్వాలన్నారు.

# ములాయం చిన్నకొడుకు ప్రతీక్ హఠాన్మరణం

- ఆస్పత్రికి తీసుకెళ్లే లోగానే మరణించినట్లు వెల్లడి
- ప్రతీక్ మృతికి అఖిలేశ్, సిఎం యోగి సంతాపం



**లక్నో,మే13 :** సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ములాయం సింగ్ యాదవ్ చిన్న కుమారుడు ప్రతీక్ యాదవ్ (38) హఠాన్మరణం చెందారు. బుధవారం ఉదయం 6:15 గంటల సమయంలో ప్రతీక్ యాదవ్ తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ను లక్నో ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆయన చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రతీక్ యాదవ్ మరణానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రాథమిక పరిశీలనలో ఆయన శరీరంపై ఎటువంటి గాయాల గుర్తులు కనిపించలేదని వైద్యులు పేర్కొన్నారు. మరణానికి గల కారణాన్ని నిర్ధారించడానికి కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్సిటీ వైద్యుల బృందం మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించనుంది. ప్రతీక్ యాదవ్.. మూలాయం సింగ్ యాదవ్ రెండో భార్య కుమారుడు, బీజేపీ నాయకురాలు అపర్ణా యాదవ్ భర్త. రాజకీయ కుటుంబంలో జన్మించినప్పటికీ, ప్రతీక్ యాదవ్ ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ రియల్ ఎస్టేట్, ఫిట్‌నెస్ రంగాల్లో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన అకాల మరణం ములాయం సింగ్ యాదవ్ కుటుంబంలో, రాజకీయ వర్గాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రతీక్ కొంతకాలంగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నారు. దీనికి చికిత్స కూడా తీసుకుంటున్నారు. ఈరోజు ఉదయం ఆయన ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. ఉత్తర్‌ప్రదేశ్ రాజకీయాల్లో యాదవ్ కుటుంబం కీలకంగా ఉన్నప్పటికీ.. ఆయన మాత్రం దూరంగా ఉండేవారు. 2011లో ప్రతీక్-అపర్ణ వివాహం జరిగింది. అయితే ఇటీవల వీరిమధ్య విభేదాలు తలెత్తాయి. అపర్ణ వల్ల తమ కుటుంబసభ్యుల మధ్య అనుబంధాలు దెబ్బతిన్నాయంటూ భార్యపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. వ్యక్తిగత స్వార్థంతో తమ కుటుంబాన్ని ఆమె ధ్వంసం చేశారంటూ జనవరిలో ఆయన చేసిన పోస్టు చర్చనీయాంశమైంది. ఈ బంధాన్ని వీలైనంత త్వరగా ముగించాలని అనుకుంటున్నట్లు, విడాకులు తీసుకుంటానని పేర్కొన్నారు. 2017లో లఖ్‌నవూ కంటోన్మెంట్ స్థానం నుంచి సమాజ్‌వాదీ తరఫున ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన అపర్ణ ఓడిపోయారు. 2022 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తరఫున ప్రచారం చేసిన ఆమె.. ప్రస్తుతం ఆ రాష్ట్ర మహిళా కమిషన్ ఉపాధ్యక్షురాలిగా ఉన్నారు. తాజాగా ప్రతీక్‌ను చేర్పించిన ఆసుపత్రి వద్ద అపర్ణ కనిపించలేదు. ప్రతీక్ యాదవ్ ఈ రోజు మన మధ్య లేరు. చిన్న వయసు నుంచే ఆరోగ్యంపై ఎంతో శ్రద్ధ వహించేవాడు. స్వయంకృషితోనే జీవితంలో ఎదగాలని కోరుకునేవాడు. రెండు నెలల క్రితం కలిసినప్పుడు ఆరోగ్యం, వ్యాపార విస్తరణ గురించి మాట్లాడుకున్నాం అంటూ అఖిలేశ్ యాదవ్ విచారం వ్యక్తంచేశారు. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, భాజపా, సమాజ్‌వాదీ పార్టీ నేతలు ప్రతీక్ మృతికి సంతాపం తెలియజేశారు.

# బక్రీద్ సందర్భంగా ప్రత్యేక చర్యలు

- అధికారులతో డిజిపి సివి ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్,మే13 :** ఈ నెల 27వ తేదీన జరిగే బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించాలని పోలీస్ అధికారులను డిజిపి సివి ఆనంద్ ఆదేశించారు. అలాగే సోషల్ మీడియాలో పుకార్లు పుట్టించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. తెలంగాణలో బక్రీద్ పండుగను పురస్కరించుకుని శాంతిభద్రతల పరిరక్షణెళి లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతోందని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, పశుసంవర్ధక శాఖ సెక్రటరీ కే. ఇలంబర్తి తదితరులతో కలిసి డీజీపీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడారు. ముఖ్యమంత్రి స్థాయిలో జరిగిన చర్చలు, అనంతరం ఉప ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశ నిర్ణయాల మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. బక్రీద్ పండుగ ఇతర పండుగల కంటే అత్యంత సున్నితమైనదని, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా రెండు వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఇటీవల పశువుల అక్రమ రవాణా ఘటనలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ అమలు కోసమే ఈ వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పశువుల రవాణా విషయంలో కౌ స్లాటర్ యాక్ట్-1977, ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్-1978, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ-1960 చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో 52 అంతరాష్ట్ర చెక్ పోస్టులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 203 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు డీజీపీ వెల్లడించారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలను ముమ్మరం చేయాలని, ముఖ్యంగా రానున్న 15 రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే పశువుల సంతలపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. చెక్ పోస్టుల వద్ద పశువుల రవాణాకు సంబంధించిన 'ఫిట్ టు ట్రాన్స్‌పోర్టేషన్', 'ఫిట్ టు స్లాటర్' వంటి ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పండుగ ముగిసే వరకు ఈ తనిఖీలు నిరంతరాయంగా కొనసాగాలని ఆదేశించారు. శాంతిభద్రతల విషయంలో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని డీజీపీ హెచ్చరించారు. పశువుల రవాణాపై ఎవరికైనా అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలే తప్ప, నేరుగా రోడ్లపైకి వచ్చి ఘర్షణ వాతావరణం సృష్టించకూడదని ఖురేషీలు, గోరక్షక బృందాలకు సూచించారు. నిబంధనలు మీరి రాద్ధాంతం చేసే వారిపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు సస్పెక్ట్ షీట్లు కూడా ఓపెన్ చేస్తామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు రెండువర్గాల వారితో విడివిడిగా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని కోరారు. పోలీస్, మున్సిపల్ పశుసంవర్ధక, రెవె న్యూ శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని, ఇందు కోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకొని సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంచుకోవాలని సూచించారు.

# రాధన్ పండిట్ వెట్రివేల్ విషయంలో యూటర్న్

- విమర్శలు రావడంతో నియామకాన్ని రద్దు చేస్తే ఉత్తర్వులు

**చెన్నై,మే13 :** జ్యోతిష్యుడు రాధన్ పండిట్ వెట్రివేల్ విషయంలో తమిళనాడు సీఎం విజయ్ వెనక్కు తగ్గారు. ఆయనను తన ఓఎస్‌డీగా నియమిస్తూ ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేశారు. ఒక జ్యోతిష్యుడిని ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా నియమించడం ఏమిటని ప్రతిపక్షాలు, మిత్రపక్షాల నుంచి విమర్శలు వచ్చిన నేపథ్యంలో సీఎం విజయ్ వెనక్కు తగ్గారు. వెట్రివేల్‌కు గతంలో ఇచ్చిన నియామక ఉత్తర్వులను రద్దు చేసినట్టు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారు. తాజాగా అసెంబ్లీలో జరిగిన బలపరీక్షలో సీఎం విజయ్ నెగ్గిన విషయం తెలిసిందే. అయితే, విశ్వాస పరీక్షకు ముందు వీసీకే ఎమ్మెల్యే వాణి అర్సు ఓఎస్‌డీ అంశాన్ని లేవనెత్తారు. శాస్త్రీయత, తార్కిక ఆలోచనా ధోరణితో ముందుకు సాగాలని అన్నారు. మూఢనమ్మకాలను పక్కనపెట్టాలని చెప్పారు. 'మన ప్రభుత్వం జ్యోతిష్యానికి కాక శాస్త్రీయ దృక్పథానికి ప్రాధాన్యం ఇవ్వాలి' అని అసెంబ్లీ వేదికగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో రాధన్ నియామక ఉత్తర్వులను ఉపసంహరించుకున్నామని ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. రిక్కి రాధన్ పండిట్ వెట్రివేల్ దగ్గర విజయ్ జ్యోతిష సలహాలు తీసుకుంటుంటారు. ఎన్నికలకు ముందే ఆయన టీవీకే విజయాన్ని ఊహించారు. జయలలిత సహా పలువురు ప్రముఖ రాజకీయ నాయకులకు కూడా ఆయన సలహాలు ఇచ్చేవారు. మంగళవారం ముఖ్యమంత్రికి ప్రత్యేక విధుల అధికారి గా వెట్రివేల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అయితే దీనిపై అన్ని పార్టీల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. ఆ విమర్శలపై విజయ్ స్పందిస్తూ.. ఆ నియామకాన్ని పునఃసమీక్షిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఓఎస్డీ బాధ్యతల నుంచి వెట్రివేల్‌ను తప్పిస్తూ విజయ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బలపరీక్ష అనంతరం ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

# పుదుచ్చేరి సిఎంగా రంగస్వామి ప్రమాణం

- వరుసగా ఐదోసారి సిఎంగా బాధ్యతలు
- ప్రమాణ కార్యక్రమానికి నితిన్ నబీన్ హాజర్
- ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని



**పుదుచ్చేరి,మే13 :** కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ఎన్.రంగస్వామి ప్రమాణ స్వీకారం చేశారు. లోక్ భవన్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ కె. కైలాసనాథన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. నమశ్శివాయం, మల్లాడి కృష్ణారావు కేబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. పుదుచ్చేరిలో ఐదోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఎన్.రంగస్వామి రికార్డు నెలకొల్పారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సహా పలువురు సీనియర్ బీజేపీ నాయకులు, మిత్రపక్షాల నేతలు, ఎన్నికైన ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం మీడియాతో రంగస్వామి మాట్లాడారు. ఎన్డీయే కూటమికి మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిపై మరింతగా దృష్టి సారిస్తుందని, ప్రజా సంక్షేమం కోసం అవసరమైన అన్ని పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. పుదుచ్చేరిని ప్రధాన అభివృద్ధి, పర్యాటక కేంద్రంగా మార్చనున్నట్లు కూడా ఆయన తెలిపారు. పుదుచ్చేరిని సింగపూర్‌లా అభివృద్ధి చేయబోతున్నట్లు సీఎం రంగస్వామి ప్రకటించారు. పుదుచ్చేరిలో ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంపై ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ప్రమాణ స్వీకారం చేసిన ముఖ్యమంత్రి, మంత్రులకు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టు పెట్టారు. 'పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎన్.రంగస్వామికి అభినందనలు. అక్కడ అభివృద్ధి ప్రస్థానాన్ని బలోపేతం చేసిన అనుభవజ్ఞుడైన, సమర్థవంతమైన పరిపాలకుడిగా ఆయన తనదైన ముద్ర వేశారు. కొత్త మంత్రులు పురోగతికి దోహ దపడతారని, అక్కడి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తారని విశ్వాసం వ్యక్తం చేస్తున్నాను' అని మోదీ పోస్టు చేశారు. 30 స్థానాలున్న పుదుచ్చేరి అసెంబ్లీకి ఇటీవల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి మెజారిటీ సీట్లు గెలుచుకుంది. ఈ కూటమిలో సీఎం రంగస్వామికి చెందిన ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ 12 స్థానాలు గెలుచుకోగా, బీజేపీ 4 స్థానాలను కైవసం చేసుకుంది. ఏఐఏడీఎంకే, ఎల్జేకే చెరో స్థానాన్ని దక్కించుకున్నాయి. మరోవైపు ప్రతిపక్షాలైన డీఎంకే 5 స్థానాలు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఒక స్థానం గెలుచుకున్నాయి. ఇక, విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం రెండు స్థానాలతో ఖాతా తెరిచింది.

# క్రైమ్‌లో తెలంగాణ రైజింగ్

## వెల్‌డన్ రాహుల్ గాంధీ అంటూ..కెటిఆర్ ట్వీట్



**హైదరాబాద్,మే13 :** తెలంగాణలో ఆడబిడ్డలపై నేరాలు పెరగడం పట్ల బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. అత్యధిక కేసులు కలిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం.. మహిళలపై నేరాల్లో దేశంలోనే అగ్రస్థానానికి చేరిందని ఆరోపించారు. తెలంగాణ మహిళలపై నేరాల రేటులో దేశంలోనే మొట్టమొదటి స్థానంలో నిలిచిందని, సైబర్ నేరాలు కూడా భారీగానే పెరిగాయని విమర్శించారు. ఈ మేరకు ట్విట్టర్ ద్వారా కేటీఆర్ మండిపడ్డారు. దేశంలోని ముఖ్యమంత్రుల్లో అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్న సీఎం రేవంత్ రెడ్డి అని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ఇచ్చిన నివేదికను ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తావించారు. 'దేశంలోనే ఏ ముఖ్యమంత్రికి లేనంతగా సీఎం/హోంమంత్రి రేవంత్ రెడ్డిపై అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఆయన నాయకత్వంలో ఇప్పుడు తెలంగాణ మహిళలపై నేరాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. సైబర్ నేరాల్లో కూడా టాప్‌లో ఉంది.' అని ట్విట్టర్ (ఎక్స్)లో కేటీఆర్ పేర్కొన్నారు. వెల్‌డన్ రాహుల్ గాంధీ.. నిజంగానే తెలంగాణ రైజింగ్ అంటూ కాంగ్రెస్ నాయకత్వాన్ని వ్యంగ్యంగా అభినందించారు.

# హైదరాబాద్‌లో ఊబర్ ఎక్సలెన్స్ సెంటర్

- ఫ్యూచర్ సిటీలో ఊబర్ కార్పోరేట్ ఆఫీస్
- సిఎం రేవంత్‌రెడ్డితో భేటీలో సిఇవో దారా ఖోస్రోషాహి వెల్లడి



**హైదరాబాద్, మే 13:** హైదరాబాద్‌లో ఉబర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విస్తరిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డికి ఉబర్ సీఈవో తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన ఈ మొదటి సెంటర్‌లో 600 మంది ఇంజనీర్లు పనిచేస్తున్నారని సీఈవో వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆసక్తి చూపించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జూబ్లీహిల్స్ నివాసంలో ఉబర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఉబర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబర్ ఇండియా, సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు. ఉబర్ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ముందుకు సాగుతామని సీఈవో ఖోస్రోషాహి స్పష్టం చేశారు. పార్కింగ్ వ్యాపారంలోకి వచ్చే అంశాన్ని పరిశీలించాలని ఉబర్ సీఈవోకి సూచించారు ముఖ్యమంత్రి. దేశంలోని ప్రముఖ నగరాల్లో పార్కింగ్ సమస్యను ఉబర్ ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు సీఎం. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మల్టీ లెవల్ పార్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. సీఎం సూచనపైన సమగ్ర అధ్యయనం చేస్తామని ఉబర్ ప్రతినిధులు తెలిపారు. వ్యాపార విస్తరణకు అన్నివిధాలుగా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఉబర్ ప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

# విపక్షనేతల అంటే లెక్కలేదా ?

## మోడీ తీరుపై మండిపడ్డ విహెచ్



**హైదరాబాద్, మే 13:** మోదీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని ప్రభుత్వ సలహాదారు వీ.హనుమంతరావు విమర్శలు గుప్పించారు. ప్రజాస్వామ్యం అంటే లెక్కలేకుండా పోయిందన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అపోజిషన్ లీడర్ అంటే రబ్బర్ స్టాంప్ అని మోదీ భావిస్తున్నారని మండిపడ్డారు. సీబీఐ డైరెక్టర్ అపాయింట్మెంట్ విషయంలో అపోజిషన్ లీడర్ అభిప్రాయాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రతిపక్ష నేత అభిప్రాయం తీసుకోకపోవడంతో రాహుల్ గాంధీ లేఖ రాసినట్లు చెప్పారు. ప్రధానికి రాహుల్ లేఖ రాయడాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. మోదీకి అనుకూలంగా ఉన్న వాళ్లను సీబీఐ డైరెక్టర్‌గా నియమిస్తారా అని వీహెచ్ ప్రశ్నించారు. భజన చేసే వాళ్లకే మోదీ.. పదవులుఇస్తున్నారనిఆరోపించారు. రాహుల్ పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు వీహెచ్ తెలిపారు. అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని బీజేపీ అవమానిస్తోందని మండిపడ్డారు. జనగణనలో బీసీ కాలమ్ లేకపోవడం అన్యాయమన్నారు. ఆర్ఎస్ఎస్ చేతిలో నరేంద్ర మోదీ కీలుబొమ్మగా మారారని దుయ్యబట్టారు. 'సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్' అబద్ధమని... బీజేపీ వికాసం మాత్రమే జరుగుతోందని వీహెచ్ వ్యాఖ్యానించారు.

# బండి భగీరథ్ అప్‌స్కాండింగ్

## నగరంలో పలుచోట్ల పోస్టర్ల కలకలం

**హైదరాబాద్,మే13 :** కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అవడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. నగరంలోని పలు ప్రాంతాల్లో బండి భగీరథ్ అబ్‌స్కాండింగ్ అంటూ పోస్టర్లు వెలిశాయి. ఈ పోస్టర్లలో 'బండి భగీరథ్ పరారీలో ఉన్నాడు. ఆచూకీ తెలిస్తే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో తెలియజేయండి' అని రాసి ఉంది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఈ పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా బండి భగీరథ్ మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉందని.. అతడు పరారీలో ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. భగీరథ్ కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. తనపై లైంగిక దాడి చేశాడంటూ భగీరథ్‌పై బాలిక ఫిర్యాదు చేసింది. ఈ కేసుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీరియస్‌గా స్పందిస్తూ.. తక్షణమే చర్యలు తీసుకోవాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించారు. దీంతో ఈ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేస్తూ డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. కేసును దర్యాప్తు చేస్తున్న సిట్.. భగీరథ్‌కు నోటీసులు జారీ చేసింది. ఈరోజు(బుధవారం) మధ్యాహ్నం 2 గంటలకు విచారణకు రావాల్సిందిగా నోటీసుల్లో పేర్కొంది. మరోవైపు తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ భగీరథ్.. తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

# బైకును ఢీకొన్న కారు..ఇద్దరు మృతి

## కారులోని వ్యక్తులు వెంటనే పరార్

**హైదరాబాద్,మే13 :** హైదరాబాద్ నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. బుధవారం మల్లాపూర్ స్వాగత్ కన్వెన్షన్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఓ కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతులు మౌలాలికి చెందిన గణేశ్, గంగాధర్‌గా పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ ప్రతిరోజు కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి అతివేగమే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులోని వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నాచారం పోలీస్ స్టేషన్ వద్ద మృతుల బంధువులు ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# లిఫ్ట్‌లో మరో చిన్నారి మృత్యువాత

## గచచిబౌలి హాస్టల్‌లో ఐదేళ్ల చిన్నారి మృతి



**హైదరాబాద్,మే13 :** గచ్చిబౌలిలో తీరని విషాదం చోటుచేసుకుంది. లిఫ్టులో ఇరుక్కుని మరో చిన్నారి మృత్యువాత పడింది. గౌలిదొడ్డిలోని ఒక ఉమెన్స్ పీజీ హాస్టల్‌లో ఓ బాలిక లిఫ్ట్ లో ఇరుక్కుని మృతి చెందింది. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఒక కుటుంబం ఉపాధి కోసం నగరానికి వలస వచ్చి.. గౌలిదొడ్డిలోని మహి ఉమెన్స్ పీజీ హాస్టల్ లో వంట పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. ఆ కుటుంబానికి చెందిన ఐదేళ్ల చిన్నారి బిస్తూ గోష్, స్థానిక పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. బుధవారం ప్రమాదవశాత్తు అపార్ట్‌మెంట్‌లోని లిఫ్ట్ ఆ చిన్నారి గ్రౌండ్ ఫ్లోర్ నుండి ఐదో అంతస్తుకు వెళ్తున్న క్రమంలో.. మూడవ అంతస్తు వద్ద చిన్నారి జుట్టు లిఫ్ట్ డోర్లలో ఇరుక్కుపోయింది. అది గమనించేలోపే లిఫ్ట్ కదలడంతో.. చిన్నారి తల నుజ్జునుజ్జు అయి అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. సమాచారం అందుకున్న స్థానికులు డయల్ 100కు కాల్ చేయగా.. పోలీసులు, హైడ్రా, ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన చిన్నారి మృతదేహాన్ని అత్యంత శ్రమతో బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హాస్టల్ నిర్వాహకుల నిర్లక్ష్యం ఉందా? అనే కోణంలో విచారణ సాగుతోంది. ఐదేళ్ల చిన్నారి కళ్లముందే విగతజీవిగా మారడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

# ప్రేమ, పెళ్లి పేరుతో మోసం

## మహిళా కానిస్టేబుల్‌ను వంచించిన ఎస్ఐ

## కొల్లూరు ఎస్ఐ సురేశ్ సస్పెన్షన్

**హైదరాబాద్,మే 13 :** మహిళా కానిస్టేబుల్‌ను ప్రేమ పేరుతో ఓ ఎస్సై మోసం చేశాడు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అంతేకాక ఉన్నతాధికారులు సదరు ఎస్సైని సస్పెండ్ చేశారు. ప్రేమిస్తున్నాను అంటూ నమ్మించి.. పెళ్లి పేరుతో కాలయాపన చేస్తూ తప్పించుకు తిరుగుతున్న కొల్లూరు పోలీస్ స్టేషన్ ఎస్సై సురేష్ కుమార్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు . కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ లో మహిళా కానిస్టేబుల్ గా పని చేస్తున్న యువతిని.. పెళ్లి చేసుకుంటానని చెప్పి ప్రేమ పేరుతో మోసం చేసినట్లు కేసు నమోదు కావటంతో.. ఈ నిర్ణయం తీసుకున్నారు ఉన్నతాధికారులు. పూర్తి వివరాల్లోకి వెళితే..2018 బ్యాచ్ ఎస్సై సురేష్ కుమార్.. కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా పని చేస్తున్న యువతితో పరిచయం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని చెప్పటంతో.. ఎస్సై సురేష్ కు దగ్గరైంది ఆ మహిళా కానిస్టేబుల్. కొన్నాళ్లుగా పెళ్లి విషయంపై ఒత్తిడి చేస్తుంది. సాకులు చెబుతూ.. పెళ్లిని వాయిదా వేస్తూ వస్తున్నారు ఎస్సై సురేష్ కుమార్. పెళ్లి వాయిదాపై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. వెంటనే పెళ్లి చేసుకోవాలని మహిళా కానిస్టేబుల్ పట్టుబట్టింది. పెళ్లి విషయంలో ఎస్సై సురేష్ కుమార్ తప్పించుకునే ప్రయత్నం చేస్తుండటంతో.. మహిళా కానిస్టేబుల్ గట్టిగా నిలదీసింది. పెళ్లి చేసుకునేది లేదని.. పెళ్లి చేసుకోవటం కుదరదు అని తేల్చి చెప్పారు ఎస్సై సురేష్. ఈ క్రమంలోనే ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేసినట్లు కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ లో కంప్లయింట్ చేసింది మహిళా కానిస్టేబుల్. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. ఎస్సై సురేష్ ను విచారించేందుకు ప్రయత్నించారు. అతని సెల్ ఫోన్లు స్విచ్ఛాఫ్ లో ఉండటంతో.. విచారణకు స్పందించకపోవటం.. అందుబాటులో లేకపోవటం వంటి కారణాలతో.. ఎస్సై సురేష్ కుమార్ ను సస్పెండ్ చేశారు ఉన్నతాధికారులు. బాధితురాలు మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఆధారాలతో ఈ నిర్ణయం తీసుకున్నారు. బాధిత యువతి ఇచ్చిన ఆధారాలతో పోలీస్ ఉన్నతాధికారులు అతణ్ని సస్పెండ్ చేశారు.

# పోలీసుల విచారణకు భగీరథ్ గైర్హాజరు

**హైదరాబాద్,మే13 :** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్.. పోలీసుల విచారణకు గైర్హాజరయ్యారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయ్యింది. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం ఈ కేసును విచారిస్తోంది. ఇందులో భాగంగా విచారణకు రావాల్సిందిగా భగీరథ్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు పోలీసుల ముందు విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే సమయం గడిచినప్పటికీ భగీరథ్.. పోలీసుల విచారణకు హాజరుకాలేదు. ఎఫ్ఐఆర్‌లో పలు సెక్షన్లను పోలీసులు జోడించారు. బాధితురాలి నుంచి రెండో సారి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. తాజాగా నిందితుడిపై తీవ్రమైన లైంగిక దాడి, ముందుగా ప్లాన్ చేసి లైంగిక చర్యలకు పాల్పడినట్లు సెక్షన్ 5 (తి)ను కూడా పోలీసులు జతపరిచారు. మరోవైపు ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టులో బండి భగీరథ్ పిటిషన్ వేశారు. గురువారం ఈ పిటిషన్‌పై హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ చేయనుంది.

బలగం TV BALAGAM
balagamtv100@gmail.com

(మొదటిపేజీ తరువాయి)

## రైతుల ఖాతాల్లోకి రూ.4,520 కోట్లు

అన్‌లోడింగ్ ప్రక్రియలను దగ్గరుండి పర్యవేక్షించడానికి, పారదర్శకతను నిర్ధారించడానికి కొనుగోలు కేంద్రాలతో పాటు మిల్లుల వద్ద కూడా ప్రత్యేక అధికారులను వ్యూహాత్మకంగా నియమించింది. హమాలీల కొరతను అధిగమించడానికి, భారీగా వస్తున్న ధాన్యాన్ని సజావుగా నిర్వహించడానికి మరియు రైతుల ప్రయోజనాలను కాపాడుతూ కొనుగోళ్లను వేగవంతం చేయడానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొనుగోలు కేంద్రాలు మరియు గోదాములలో ధాన్యం నిర్వహణ ఛార్జీలను అధికారికంగా క్వింటాల్‌కు రూ. 17/- కి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విధానాలతో రైతులకు ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో చెల్లింపులు జరిగేలా చూస్తోంది. తమకు ఏవైనా సందేహాలు, సమస్యలు ఉన్నా లేదా సహాయం కావాలన్నా పౌరసరఫరాల శాఖకు చెందిన టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1967 ను సంప్రదించాలని తెలిపింది.

## నీట్ పేపర్ లీక్‌లో సిబిఐ దూకుడు

ఈ వ్యవహారంలో పరీక్షకు ముందుగానే కొందరు అభ్యర్థులకు ప్రశ్నాపత్రం అందించినట్లు అనుమానిస్తున్నారు.సీబీఐ అధికారులు ఇప్పటివరకు ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందినవారు కాగా, ఒకరు హరియాణాలోని గురుగ్రామ్‌కు చెందిన వ్యక్తి. మరొకరు మహారాష్ట్ర లోని నాసిక్ ప్రాంతానికి చెందినవారు. అరెస్టయిన వ్యక్తులు ప్రశ్నాపత్రం సేకరణ, పంపిణీ, అభ్యర్థులతో సంబంధాలు ఏర్పరచడం వంటి కీలక కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. వీరిని కోర్టులో హాజరుపరిచి కస్టడీకి తీసుకుని సమగ్రంగా విచారిస్తున్నారు. రాజస్థాన్ రాష్ట్రంలోని జమ్వా రామ్‌గడ్ ప్రాంతానికి చెందిన మంగీలాల్, దినేశ్ బివాల్ సోదరులను సీబీఐ అధికారులు బుధవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఇద్దరు ఈ పేపర్ లీక్ వ్యవహారంలో ప్రధాన మధ్యవర్తులుగా వ్యవహరిం చినట్లు అనుమానిస్తున్నారు. వారి ఇళ్లలో నిర్వహించిన సోదాల్లో పలు డిజిటల్ ఆధారాలు, బ్యాంక్ ఖాతాల వివరాలు, అభ్యర్థుల జాబితాలు లభించినట్లు సమాచారం. వీరి ద్వారా మరికొందరు అనుమానితుల వివరాలు కూడా సీబీఐకి లభించినట్లు తెలుస్తోంది. రాజస్థాన్‌లో సోదాలు కొనసాగుతుండగానే మహారాష్ట్రలో కూడా సీబీఐ తన దర్యాప్తును విస్తరించింది. అక్కడ ఇద్దరు మహిళలను అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ మహిళలు అభ్యర్థులు, మధ్యవర్తుల మధ్య సంబంధాలు ఏర్పరచడంలో కీలక పాత్ర పోషించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరి ఫోన్ కాల్ రికార్డులు, బ్యాంక్ లావాదేవీలు, సోషల్ మీడియా కమ్యూనికేషన్‌లను అధికారులు విశ్లేషిస్తున్నారు. ఈ వ్యవహారం అంతర్రాష్ట్ర నెట్‌వర్క్ ద్వారా నిర్వహించినట్లు సీబీఐ అధికారులు భావిస్తున్నారు. బుధవారం దేశవ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు సహా పలు డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకుంది. దిల్లీలోని 'జాతీయ పరీక్షల సంస్థ' (ఎన్‌టీఏ) ప్రధాన కార్యాలయాన్నీ సందర్శించి.. రద్దయిన పరీక్షకు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను సేకరించింది. ఈ పరీక్షా ప్రక్రియలో పాలుపంచుకున్న అధికారులతో సీబీఐ బృందం మాట్లాడినట్లు అధికారులు తెలిపారు. ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో.. ఈ నెల 3న నిర్వహించిన నీట్-యూజీ పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసిన విషయం తెలిసిందే.

## బండి భగీరథ్ అరెస్ట్ తప్పదు

ఇవ్వాలన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ ఉద్యమంలో మొదటి నుంచి ఉన్నారని.. కవిత, కేటీఆర్ తర్వాత వచ్చారని తెలిపారు. తెలంగాణలోనూ ఎస్ఐఆర్‌తో అక్రమాలు చేయాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. ఎవరి ఓటును వాళ్లు కాపాడుకోవాలని సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌజ్‌కు పరిమితమై వ్యక్తిగత జీవితానికి అలవాటు పడ్డారన్నారు. రాష్ట్రంలో గతం కంటే ఈసారి ఎక్కువగా పంట దిగుబడి వచ్చిందని మహేశ్ అన్నారు. ధాన్యం కొనుగోలు జరుగుతోందని.. ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. గత ప్రభుత్వం చేస్తున్న అప్పులు తీర్చుతూనే అభివృద్ధి చేస్తున్నామన్నారు. బెంగాల్‌లో బీజేపీ ప్రజాస్వామ్యబద్ధంగా గెలవలేదని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు.

## పొదుపు సూత్రాలు తెలంగాణకు

చేయాలని డిమాండ్ చేశారు. ఆడపిల్ల జీవితం నాశనం అయ్యే విధంగా సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేసిన వారిని అరెస్ట్ చేయాలని.. సోషల్ మీడియా అకౌంట్స్ బ్లాక్ చేయాలన్నారు. బాధితురాలి వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయాల్సిన అత్యుత్సాహం బీఆర్‌ఎస్ పార్టీకి ఎందుకని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై ప్రధాని మోదీ మాట్లాడలేదని టీఆర్‌ఎస్ అధ్యక్షురాలు అన్నారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వాలన్నారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కోసం కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు పోలవరం పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కలిశారని.. పోలవరం ప్రాజెక్ట్‌ను 5 సార్లు సందర్శించారని తెలిపారు. కానీ తెలంగాణ సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఒక్కసారి కూడా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు వెళ్లలేదని విమర్శించారు. ఏపీ నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటోందన్నారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే వాటర్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. చెక్ డ్యామ్‌లు కట్టి నీటి వనరులను సద్వినియోగం చేస్తామని తెలిపారు. ప్రధాని పర్యటనపై బీఆర్‌ఎస్ ఒక్క మాట మాట్లాడలేదని విమర్శించారు. ÷ఎలగణనలో ఓబీసీ కాలమ్ పెట్టాలని కవిత డిమాండ్ చేశారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడానికి దేశం మొత్తం తిరుగుతామని చెప్పారు. పోలవరం, బనకచర్లపై రిట్ పిటిషన్ వేయనున్నట్లు కవిత తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం ఇస్తామన్నారు. నీట్ లాంటి జాతీయ పరీక్ష పేపర్ల లీక్ ఘటన అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుకోవద్దని హెచ్చరించారు. టీఆర్‌ఎస్ జెండా పండుగలో తాను పాల్గొంటానని తెలిపారు. తెలంగాణ రాజకీయ శూన్యతను భర్తీ చేయడానికి తెలంగాణ రక్షణ సేన పుట్టిందని కవిత పేర్కొన్నారు.

## ఎయిర్ ఇండియా సంచలన నిర్ణయం

అమెరికాకు వారానికి 33, ఐరోపాకు 47, యూకేకు 57, ఆస్ట్రేలియాకు 8, ఫార్ ఈస్ట్, ఆగ్నేయాసియా, సార్క్ ప్రాంతాలకు 158 విమానాల చొప్పున నడవనున్నాయి. అలాగే మారిషస్‌కు వారానికి ఏడు విమాన సర్వీసులు ఉన్నట్లు పేర్కొంది. కాగా, నష్టాల దృష్ట్యానే ఎయిర్ ఇండియా సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## బీజింగ్ చేరుకున్న ట్రంప్

బీజింగ్,మే13 : మూడు రోజుల పర్యటన కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బీజింగ్‌కు చేరుకున్నారు. చివరిసారి 2017లో ట్రంప్ చైనా వెళ్లారు. దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ చైనా పర్యటనకు వెళ్లారు. ఇరాన్ యుద్ధం, చైనాతో ట్రేడ్ వార్, తైవాన్‌కు అమెరికా ఆయుధాల విక్రయం నేపథ్యంలో ఈ పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఆయా విషయాలపై చైనా అధ్యక్షుడు జిన్ పింగ్‌తో ట్రంప్ చర్చించనున్నట్టు సమాచారం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పాటు పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు కూడా చైనా చేరుకున్నారు. ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కూడా ట్రంప్‌తో పాటు చైనా వెళ్లారు. తాను కూడా బీజింగ్ చేరుకున్నట్టు మస్క్ ట్వీట్ చేశారు. అమెరికా అధికారులతో పాటు యాపిల్ సీఈవో టిమ్ కుక్, ఎన్‌విడియాకు చెందిన జెన్సన్ హువాంగ్ వంటి అగ్రశ్రేణి కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌లు కూడా చైనాకు వెళ్లినట్టు సమాచారం . చైనాతో అమెరికా టెక్‌కు సంబంధించి పెద్ద ఒప్పందం చేసుకునే అవకాశం ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి . ఇదే సమయంలో ఇరాన్ యుద్ధం కూడా ఈ సమావేశానికి ప్రధాన అజెండాగా మారింది. చైనా ప్రభావంతో ఇరాన్‌పై ఒత్తిడి తీసుకురావాలని ట్రంప్ భావిస్తున్నట్లు సమాచారం. బీజింగ్ విమానాశ్రయంలో ట్రంప్‌నకు ఘన స్వాగతం లభించింది. చైనా ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్, ట్రంప్‌నకు స్వాగతం పలికారు.

## దోపిడీ నేపాలీ ముఠా కోసం గాలింపు

హైదరాబాద్,మే13 : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ ఠాణా పరిధిలో నేపాలీ దోపిడీ దొంగలు రెచ్చిపోయిన ఘటనపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. కౌకూరు గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో విశ్రాంత ప్రొఫెసర్ మురళీధర్ మోహన్(68), భార్య డాక్టర్ విజయలక్ష్మి(58)ని బంధించి 75 తులాల బంగారం, 20 కిలోల వెండితో నిందితులు పరారైన విషయం తెలిసిందే. దోపిడీలో 8 మంది సభ్యుల నేపాలీ ముఠా పాల్గొన్నట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. వృద్ధ దంపతులను ఇంట్లో బంధించిన తర్వాత నిందితులు ఆటో బుక్ చేసుకుని అక్కడి నుంచి వెళ్లి పోయిన సీసీ టీవీ ఫుటేజ్‌ని పోలీసులు సేకరించారు. ఘటన తర్వాత ప్రొఫెసర్ ఇంట్లోని హార్డ్ డిస్క్‌లు, సీసీ కెమెరాలను నిందితులు ధ్వంసం చేసినట్టు పోలీసులు తెలిపారు. మల్కాజిగిరి సీపీ సుమతి ఘటనాస్థలిని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. నిందితులంతా ఇప్పటికే నేపాల్ చేరుకుని ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

## ఫోక్సో కేసును కులానికి ఆపాదించే యత్నం

### ఇది కుల సమస్య కాదని గుర్తించాలన్న గంగుల

హైదరాబాద్,మే13 : కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కొడుకు సాయి భగీరథ్ విషయంలో బీఆర్‌ఎస్ భాధితురాలి పక్షాన ఉందని మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ నేతల ఒత్తిడితోనే కేంద్ర మంత్రి కొడుకుపై కేసు నమోదు చేశారన్నారు. బండి సంజయ్ కొడుకు పోక్సో కేసును కులానికి ఆపాదించే ప్రయత్నం చేస్తున్నారు. ఇది కుల సమస్య కాదు. లా అండ్ ఆర్డర్ సమస్య. నిన్న కరీంనగర్ లో బెదిరింపు ధోరణిలో మాట్లాడిన బండి సంజయ్ ఎవరి అంతు చూస్తావ్..? బాధితురాలిని అంతం చేస్తావా, లేకపోతే ఎవరు ప్రశ్నిస్తే వాళ్ళను అంతం చేస్తావా..? అని గంగుల ప్రశ్నించారు. చట్టానికి, పోలీసులకు బండి సంజయ్ కుమారుడు సహకరించాలన్నారు. కాగా బండి సాయి భగీరథ్‌పై ఇప్పటికే పోక్సో కేసు నమోదుచేసిన పోలీసులు.. అతడిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో తాజాగా కొన్ని సెక్షన్లను అదనంగా చేర్చారు. పోక్సో చట్టం సెక్షన్ 5(1) రెడ్ విత్ 6ను జత చేశారని తెలిసిందే.

## కళ్లాల సౌకర్యం లేక రైతులకు నష్టం

- అకాల వర్షంతో తడిసి ముద్దవుతున్న ధాన్యం
- తక్కువ ధరలకు దళారులకు అమ్ముకునే దుస్థితి



కాకినాడ,మే13 : ధాన్యాన్ని ఆరబోసుకునేందుకు కళ్లాల సౌకర్యం లేకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధాన రహదారుల వెంబడి కొంతమంది రైతులు ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. 17 శాతం తేమ ఉండాలనే రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. సుమారు నాలుగు రోజుల పాటు ఎండలో ధాన్యాన్ని ఆరబోయాల్సి వస్తోంది. ఇటీవల రెండుసార్లు కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోయింది. దీంతో, పచ్చి ధాన్యాన్ని దళారులకే తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. 75 కిలోల సాధారణ రకానికి రూ.1,725, 'ఎ' గ్రేడ్ రకానికి రూ.1,740 మద్దతు ధర ఇవ్వాలి. దళారులు కొన్ని ప్రాంతాల్లో 1250 నుంచి రూ.1300, మరికొన్ని ప్రాంతాల్లో రూ.1,400 మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీంతో, బస్తాపై రైతులు రూ.300 నుంచి రూ.400 వరకూ నష్టపోయారు. దళారికి 75 కిలోల బస్తా రూ.1,400కు అమ్ముకోవాల్సి వచ్చిందని వాపోయారు. 70 శాతం మంది ఈ విధంగానే ధాన్యాన్ని అమ్ముకున్నారని తెలిపారు. ప్రభుత్వం సకాలంలో కొనుగోలు ప్రక్రియ ప్రారంభించలేదు. తేమ శాతం నిబంధన వంటి కారణాల వల్ల వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. 75 కిలోల బస్తాను రూ.1,400 కే ఇచ్చేయాల్సి వచ్చిందని వాపోయారు. ధాన్యం కొనుగోళ్లలో దళారుల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. దీంతో, మద్దతు ధర లభించక అన్నదాతలు నష్టపోతున్నారు. కాకినాడ జిల్లాలో ఇప్పటికే 90 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వచ్చింది. ఇందులో ప్రభుత్వం కొన్నది 1.30 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే. ఈ ఏడాది రబీలో ఎకరాకు సుమారు 45 బస్తాల దిగుబడి వచ్చింది. కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తున్న ధాన్యాన్ని నిబంధనల పేరుతో తిరస్కరిస్తుండడం, మేఘాలు, వర్షాలు భయపెడుతుండడంతో రైతులు గత్యంతరంలేని పరిస్థితుల్లో దళారులను తెగనమ్ముకోవాల్సి వస్తోంది. ఈ ఏడాది రబీ సీజన్లో కాకినాడ జిల్లాలో 1.87 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. 6.76 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకూ 1.65 లక్షల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. సుమారు ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యింది. ఇందులో 1.30 లక్షల మెట్రిక్ టన్నుల (21.67 శాతం) ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసింది. 3.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని దళారులు కొనుగోలు చేశారు. మిగిలిన ధాన్యం కళ్లాల్లోనే ఉంది. వాతావరణ పరిస్థితులు భయపెడుతున్న నేపథ్యంలో వరి కోత, నూర్పిడి పనులను 95 శాతం మేర యంత్రాల ద్వారానే పూర్తి చేస్తున్నారు.

## అమరావతితో పాటే విశాఖ అభివృద్ధి

- అక్కడ ఇప్పటికే అనేక సంస్థలు రాక
- టెక్నాలజీ హబ్‌గా రాయలసీమ
- తిరుపతిలో ఏరోస్పేస్ సిటీ అభివృద్ధి
- కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటు
- కిమ్స్ ఆసుపత్రి శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు



అమరావతి,మే13 : అభివృద్ధి విషయంలో ఒక్క అమరావతిపైనే శ్రద్ధ పెట్టట్లేదని.. విశాఖనూ విశ్వనగరంగా చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విశాఖను ఐటి పరంగా అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే అనేక ప్రాజెక్టులు అక్కడ వచ్చాయని అన్నారు. రాజధాని ప్రాంతంలో కిమ్స్ ఆసుపత్రి, వైద్య విశ్వవిద్యాలయం నిర్మాణానికి బుధవారం సీఎం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. 'రాయలసీమను రతనాల సీమగా మారుస్తున్నాం. ఆ ప్రాంతానికి అనేక పరిశ్రమలు వస్తున్నాయి. ఏరో స్పేస్ హబ్‌గా అనంతపురం మారబోతోంది. రాయలసీమ 'టెక్నాలజీ హబ్'గా తయారవుతోంది. తిరుపతిలో ఏరో స్పేస్ సిటీ, కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటు కాబోతున్నాయి. శ్రీసిటీ.. ఇండస్ట్రియల్ హబ్‌గా తయారైందని వివరించారు. ఇకపోతే కిమ్స్ అధినేత భాస్కర్‌రావు ఒక విజన్ ఇచ్చారు. 2027 మే 13న కిమ్స్ ఆసుపత్రిని ప్రారంభిస్తాం అన్నారు. 2028 ఆగస్టు 15 కంటే ముందే విశాఖలో గూగుల్ తన కార్యకలాపాలు ప్రారంభిస్తుంది. 2028 డిసెంబరులోపు ఫేజ్-1 పూర్తి చేయాలని ఆర్సెల్లార్ మిత్తల్‌కు ఆదేశాలు ఇచ్చాం. ఎలాంటి అనుమతులు కావాలన్నా త్వరగా ఇస్తాం. లక్ష మందికి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తాం. వైద్యులు కూడా ఏఐని నేర్చుకుంటున్నారు. లక్ష మందికి ఉద్యోగాలు ఇవ్వాలనేదే మా ప్రభుత్వ ఆలోచన. ప్రపంచంలో ప్రతి ముగ్గురు వైద్యుల్లో ఒకరు ఇక్కడి నుంచే ఉండాలి. డిసెంబరు నాటికి భారత్‌లో క్వాంటం కంప్యూటింగ్‌కు చిరునామాగా అమరావతి అవుతుందని చంద్రబాబు అన్నారు. విదేశాలపై ఆధారపడకుండా గ్రీన్ ఎనర్జీని మన రాష్ట్రంలోనే ఉత్పత్తి చేసుకునేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం. ప్రతి పొలంలో, ఇంటిపైనా సోలార్ రూఫ్‌టాప్ లాంటి విద్యుదుత్పత్తి కేంద్రాలు తీసుకొస్తాం. పశ్చిమాసియా యుద్ధం వల్ల పెట్రోల్, గ్యాస్, డీజిల్ కొరత వచ్చింది. భవిష్యత్తులో వర్క్‌ఫ్రమ్ హోం వస్తుంది.. ప్రభు త్వంలో కూడా తీసుకొస్తాం. 10 కార్లతో కాన్వా య్‌గా రావడం ఫ్యాషనైంది.. సెక్యూరిటీ అర్థవంతంగా ఉండాలి. హాలిడే వస్తే విదేశాలకు వెళ్తున్నారు. మంచి పర్యాటక ప్రదేశాలు మన దేశంలోనే ఉన్నాయి. అరకు, పాపికొండలు, గండికోట వంటి ప్రదేశాలు మన రాష్ట్రంలో ఉన్నాయి. గోవాను మించిన టూరిజం కేంద్రంగా సూర్యలంక మారుతుందని సీఎం అన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ పొదుపు పిలుపు ఆవశ్యం




- మనం కూడా ఆచరించి భాగస్వాములం అవుదాం
- కాన్వాయ్‌లు, భద్రతా సిబ్బందిని కుదించుకుందాం
- నిడమర్రులో జరిగిన కార్యక్రమంలో చంద్రబాబు

అమరావతి,మే13 : పశ్చిమాసియా యుద్ధ పరిస్థితుల వల్ల దేశంపై పలు విధాలుగా భారం పడుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రధాని ప్రకటించిన 8 పొదుపు సూచనలు పాటించాలని ప్రజలకు సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. మరో రెండు రోజుల్లో ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వ పరంగా కూడా ఓ కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ప్రభుత్వాలతో పాటు, ప్రజలు కూడా బాధ్యతగా ఉండాలని సూచించారు. ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు 8 సూచనలను మనం పాటించాలని.. తాత్కాలికంగా వచ్చే ఇబ్బందులను అధిగమించాలని దిశానిర్దేశర చేశారు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించిన పొదుపు సూచనలపై సీఎం స్పందించారు. నిడమర్రులో సీఎం చంద్రబాబు బుధవారం పర్యటించారు. కిమ్స్ ఆస్పత్రికి భూమి పూజ చేశారు. బైసర్ స్కిల్ వర్సిటీ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, అమలాపురం ఎంపీ హరీశ్ బాలయోగి, మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. పెట్రోలు, డీజిల్ వినియోగం తగ్గించాలని.. దీని వల్ల విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుందని చెప్పుకొచ్చారు. వర్క్ ఫ్రమ్ హోమ్ అనేది రియాలిటీ అని.. ఇంటి నుంచే ప్రపంచం మొత్తం పనిచేసే పరిస్థితి వస్తుందని.. దీనిని ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వంలోనూ ఈ తరహా విధానాన్ని అమలు చేసే పరిస్థితులు వస్తాయని.. దేశం మొత్తం దుబారాను తగ్గించాలని మార్గనిర్దేశర చేశారు. పెద్ద పెద్ద కాన్వాయ్ వాహనాల్లో వెళ్లటం అందరికీ చాలా పెద్ద ఫ్యాషన్‌గా మారిందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. కాన్వాయ్ వాహనాల సంఖ్య తగ్గించి ప్రజాప్రతినిధులు ఆదర్శంగా నిలవాలని.. సెక్యూరిటీని కూడా కుదించుకోవాలని సూచించారు. విదేశీ పర్యటనలు తగ్గించుకోవాలని ప్రధాని మోదీ సూచించారని.. దీనిని కూడా మనం పాటిద్దామని పిలుపునిచ్చారు. మన దేశంలో, రాష్ట్రంలోనూ మంచి పర్యాటక ప్రాంతాలున్నాయని వివరించారు. ప్రజలు విదేశాలకు వెళ్లడం కంటే మన పర్యాటక ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. 'నాదేశం- నా బాధ్యత' అనే ఆలోచనను ప్రజలంతా ఆచరించాలని అన్నారు. రెండు రోజుల్లో ఈ విషయంపై చర్చించి స్పష్టమైన ప్రకటన చేస్తామని తెలిపారు. బంగారం కొనడాన్ని కూడా తగ్గించాలని ప్రధాని చెప్పారని ప్రస్తావించారు. దీనిపైనా ప్రజలు ఆలోచన చేయాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## అత్యవసరంగా గన్నవరంలో దిగిన ఇండిగో

విజయవాడ,మే13 : గన్నవరం ఎయిర్‌పోర్టులో పుణె ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయింది. పుణె నుంచి హైదరాబాద్‌కు 187 మంది ప్రయాణికులతో విమానం బయలుదేరింది. అయితే, హైదరాబాద్ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యేందుకు పరిస్థితులు అనుకూలించలేదు. దీంతో ఎయిర్‌పోర్టు పరిసర ప్రాంతాల్లో చాలా సేపు గాలిలోనే చక్కర్లు కొట్టింది ఇండిగో విమానం. అయినా, వాతావరణ పరిస్థితులు ఏమాత్రం అనుకూలించకపోవడంతో పైలట్ విమానాన్ని గన్నవరం విమానాశ్రయం వైపునకు మళ్లించారు. అక్కడికి చేరుకున్న అనంతరం అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఏం జరుగుతుందో అర్థం కాని ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. చివరికి సురక్షితంగా విమానం కిందకు దిగడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా, సుమారు రెండు గంటలుగా గన్నవరం ఎయిర్‌పోర్టు రన్‌వేపైనే పుణె ఇండిగో విమానాన్ని అధికారులు నిలిపివేశారు.

## కస్టోడియల్ టార్చర్ కేసు




- జగన్‌ను వదిలే ప్రసక్తి లేదు
- డిప్యూటి స్పీకర్ రఘురామ

భీమవరం,మే13 : వైసీపీ హయాంలో తనపై నమోదైన కస్టోడియల్ టార్చర్ కేసును వదిలే ప్రసక్తే లేదని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, తెలుగుదేశం పార్టీ ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు స్పష్టం చేశారు. ఈ కేసుపై తాను పట్టువదలని విక్రమార్కుడిలా న్యాయం కోసం ప్రయత్నిస్తున్నానని వ్యాఖ్యానించారు. బుధవారం పశ్చిమ గోదావరి జిల్లాలో రఘురామ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడారు. గురువారం తన పుట్టినరోజు అని.. తన కేసు రేపటికి ఐదేళ్లు అవుతుందని తెలిపారు. తన కేసులో మూడో ముద్దాయిగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉన్నారని ప్రస్తావించారు. మొదటి ముద్దాయి విచారణకు రాయల్‌గా వచ్చి రాయల్‌గా వెళ్లిపోయారని రఘురామ విమర్శించారు. రెండో ముద్దాయిని, మూడో ముద్దాయిని ఇంకా విచారణకు ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. ఈ కేసులో జగన్ రెడ్డి, సునీల్ కుమార్ పేర్లు ఉన్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం పోలవరం పనులను శరవేగంగా పూర్తి చేస్తోందని తెలిపారు. 2027 జూన్‌లో పోలవరం పూర్తి అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారని అన్నారు. పోలవరంతో పాటు తన కస్టోడియల్ టార్చర్ కేసును కూడా పూర్తి చేస్తారనే నమ్మకం తనకు ఉందని చెప్పుకొచ్చారు. తనపై మహాసేన రాజేశ్ పెట్టిన పోస్టును చూశానని తెలిపారు. జగన్ రెడ్డిని ఇప్పటివరకు తాను ఎందుకు ప్రశ్నించలేదని రాజేశ్ అడిగారని చెప్పారు. ఈ విషయంపై ఆయనతో మాట్లాడ తానని అన్నారు. జగన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడే ఆయన చేసిన దారుణాల గురించి తాను మాట్లాడానని చెప్పుకొచ్చారు. రచ్చబండ ద్వారా జగన్ రెడ్డిని ఓడించే వరకు మాట్లాడానని తెలిపారు. ఎన్నికల్లో జగన్ దారుణంగా ఓడిపోయారని విమర్శించారు. ఇంకా జగన్ గురించి తాను మాట్లాడేది ఏముందని రఘురామ ప్రశ్నించారు.

## 15న ఆధారాలతో విచారణకు వస్తా

### పోలీసులకు బండి భగీరథ్ లేఖ



హైదరాబాద్,మే 13 : పేట్ బషీరాబాద్ పోలీసులకు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ ఓ లేఖ పంపించారు. బుధవారం మధ్యాహ్నం పోలీసుల ఎదుట హాజరు కావాల్సి ఉన్నప్పటికీ, వ్యక్తిగత కారణాల నేపథ్యంలో మే 15వ తేదీన విచారణకు హాజరవుతానని తన లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు సిట్ అధికారులకు ఈమెయిల్‌తో పాటు అధికారిక లేఖను కూడా బండి భగీరథ పంపించారు. ఈ కేసులో విచారణకు హాజరయ్యే సమయంలో కీలక ఆధారాలు, సాక్ష్యాలతో వస్తానని ఆయన స్పష్టం చేశారు. అలాగే సిట్ అధికారుల దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని భగీరథ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో అవసరమైన సమాచారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. బండి భగీరథ పంపిన లేఖ ప్రస్తుతం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మే 15వ తేదీన జరగనున్న విచారణలో ఆయన సమర్పించే ఆధారాలు కీలకంగా మారే అవకాశం ఉంది. అయితే భగీరథ బెయిల్ కేసులో గురువారం 14న హైకోర్టులో విచారణ జరగాల్సి ఉంది.

## సంపాదకీయం

# ఖర్చులు తగ్గింపు...మోడీ నుంచే మొదలవ్వాలి !

మంచో చెడో...ప్రధాని మోడీ చేసిన ఓ సూచన ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇంకా మారాల్సి ఉంది. దీనిపై పైనుంచి కింది వరకు చర్చించాలి. అదేంటంటే ఖర్చులు తగ్గించాలి. బంగారం కొనగూడదు.. ఇంధనం తగ్గించుకుని వాహనాలను మూలన పెట్టాలి. లేదా తక్కువ మోతాదులో ఇంధనం వాడుకోవాలి. దేశహితం కోసం ఇది మంచిదే. అయితే ఎవరు ఖర్చులు తగ్గించాలన్నదే ముఖ్యం. దేశ అర్థిక వ్యవస్థ బలోపేతం కావడానికి ముందుగా ఖర్చుల జాబితాను రూపొందించి తగ్గించాలి. ప్రధాని మొదలు, ఎమ్మెల్యేల వరకు ఖర్చులు తగ్గించే ప్రయత్నం నేటినుంచే మొదలు పెడితే మంచిది. ఇందులో ప్రధానంగా రాజకీయ నాయకలు నుంచి తగ్గింపు మొదలైతే దేశం దరిద్రం పోతుంది. ముందుగా వారి జీతభత్యాల్లో కోత పెట్టాలి. వేలకోట్లు జీతభత్యాలు, విమాన ఖర్చులు, కార్లు, కాన్వాయ్‌ల ఖర్చులు వెంటనే కోత విధించాలి. ప్రధాని పిలుపు మేరకు దేశ ప్రజలు ఇంధన వినియోగం, బంగారం కొనుగోళ్లు, వంట నూనెల వినియోగం 10 శాతం తగ్గించుకుని, ఎరువుల దిగుమతులను 50శాతం మేర తగ్గించి, అనవసర విదేశీ పర్యటనలను మానుకుంటే.. ఏడాదిలో 4500 కోట్ల డాలర్ల మేర విదేశీ మారక ద్రవ్య నిల్వలను ఆదా చేయొచ్చని ఒక అంచనా. అంటే మన కరెన్సీలో దాదాపుగా రూ.4.3 లక్షల కోట్లు అన్న మాట. ఇది మంచి సలహా గనక ఎవరు తగ్గించుకోవాలన్న చర్చ మొదలు పెట్టాలి. అందుకే రాజకీయంగా అవుతున్న దుబారాను ముందుగా తగ్గించాలి. ఈ ఖర్చులు తగ్గితే విదేశీ మారకం నిల్వలు పెరుగుతాయి. దేశ జిడిపి పెరుగుతుంది. ప్రజలకు నిత్యావసర వస్తువులు సరసమైన ధరలకు దక్కుతాయి. రాజకీయ నాయకులు జీతభత్యాలు, కార్లు, విమానాలు, హెలికాప్టర్ల ఖర్చులు, అనవసరంగా విదేశీ టూర్లు, ఉచిత పథకాలు వంటివన్నింటిపైనా బ్యాన్ విధించాలి. ముందుగా ప్రధాని మోడీ టూర్లు తగ్గాలి. సిఎంల ప్రమాణాలకు సిఎంలను, కేంద్రమంత్రులను పిలవడం వల్ల ఎంత ఖర్చయ్యిందో లెక్కలు చెప్పాలి. అట్టహాసపు ప్రమాణ స్వీకారాల ఖర్చును దేశంపై రుద్దడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. చంద్రబాబు లాంటి వారు హెలికాప్టర్లు వేసుకుని పెన్షన్లు పంచడానికి వెళ్లడాన్ని నిషేధించాలి. అనవసర ఖర్చులతో రాష్ట్ర ఖజనాలను గుల్లచేసిన వారినుంచి ఆ మొత్తాలను రాబట్టాలి. ఇందుకోసం ఎంతటి కఠిన నిర్ణయమైనా తీసుకున్నా ఫర్వాలేదు. దేశ ఆర్థిక వ్యవస్థ బాగా ఉందంటే...అందుకు విదేశీ మారక నిల్వల మొత్తమే రుజువు. విదేశీ మారక ద్రవ్య నిల్వలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. ఒక దేశం ఎంత ధనికమైనది, ఎంత సురక్షితమైనది అని చెప్పడానికి ఈ ఫారెక్స్ రిజర్వులు కొలమానం లాంటివి. ఇవి తగ్గుతాయంటే మనం దిగుమతులను తగ్గించాలి. మన వ్యవసాయ ఉత్పత్తులను విదేశాలకు అమ్ముకోవాలి. ఇక్కడ రైతులు ధాన్యం కొనుగోళ్లు లేక దిగాలు పడుతున్నారు. అందువల్ల దేశీయంగా ఉత్పత్తి అయిన వస్తువులను వాడుదాం. అప్పుడు కూడా భారీగా ఖర్చులు తగ్గుతాయి. మోడీ ఇచ్చిన సలహాలను పాజిటివ్‌గా తీసుకుంటే మంచిదే. అయితే ఇది రాజకీయ నాయకులకు మాత్రమే హెచ్చరిక కావాలి. వారే తమ ఇంటి నుంచి సంస్కరణలు ప్రారంభించాలి. ఇకపోతే ప్రధాని మోదీ తన ప్రసంగంలో బంగారం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించడానికి కారణం ఏంటంటే.. భారతీయులు ఏడాదికి సగటున కొనే పసిడి దాదాపు 700-900 టన్నులని అంచనా! దీని విలువ సుమారు రూ.13.69 లక్షల కోట్లు. 2024-25తో పోలిస్తే.. 2025-26లో మన బంగారం దిగుమతులు దాదాపు 24శాతం పెరిగాయి. భారతీయులు కొనే బంగారంలో 90 శాతానికి పైగా విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నదే. అందుకు మనం భారీగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఖర్చు చేయాల్సి వస్తోంది. కాబట్టి మోదీ చెప్పినట్లు ఏడాది పాటు బంగారం కొనకుండా ఉంటే కచ్చితంగా మన విదేశీ మారక ద్రవ్య నిల్వలపై భారం కాస్తంతైనా తగ్గుతుంది. ఇందులో ఉన్నత వర్గాల వారి కొనుగోళ్లే ఎక్కువని గుర్తించాలి. ఉన్నత వర్గాల వారు సైతం బంగారం కొనుగోళ్లు చేపట్టకుండా చూడాలి. బంగారం దిగుముతలపై ఆంక్షలు విధించాలి. దీంతో దేశీయంగా ఇళ్లల్లో మూలుగుతున్న బంగారన్ని బయటకు తీసి ఆదాయ వనరుగా మార్చాలి. ఇవన్నీ చేయగలుగుతామని చెప్పాలి. ఇకపోతే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలో బీజేపీ అధికార పగ్గాలు చేపట్టినప్పుడు, సామాన్యుడు తన కష్టాలన్నీ తీరిపోతాయని, భవిష్యత్తు బంగారం అవుతుందని కలలుగన్నాడు. కానీ కలలు కల్లలు అయ్యాయి. వస్తూత్పత్తి పెరిగింది. దాన్యం దిగుబడులు పెరిగాయి. కానీ ధరలు అమాంతంగా అంతకు రెట్టింపు అయ్యాయి. విద్యవైద్యం ఖరీదైన వస్తువుగా మారింది. అందుకే ప్రధాని మోడీ మాటలను సానుకూలంగా తీసుకుని నిజాన్ని మాట్లాడుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. అచ్చే దిన్ అన్న మోడీ మంచి రోజులు నిజంగా సామాన్యుడి ముంగిట నిలిచాయా అన్నది కూడా చర్చించాలి. కానీ నినాదాల హోరులో నిజాలు సమాధి అయ్యాయి. ప్రభుత్వ ప్రకటనలు చూస్తుంటే భారతదేశం వెలిగిపోతున్నట్లు కనిపిస్తున్నది. కానీ సామాన్యుల బతుకులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ప్రపంచంలోనే 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ, డిజిటల్ ఇండియా విప్లవం, మేక్ ఇన్ ఇండియా అంటూ భారీ నినాదలు బయలుదేరాయి. కానీ రాజకీయ నాయకులు బలపడుతున్నారు. ప్రజలు బలహీన పడుతున్నారు. రాజకీయ నాయకులకు ఊడిగం చేసే దౌర్భాగ్యం పెరుగుతోంది. ఒక దేశంగా మనం ఎంత గర్వంగా తలెత్తుకుంటున్నామో, అదే స్థాయిలో అప్పుల భారంతో తల దించుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తున్నది. అందుకే ఖర్చులు తగ్గించుకోవడం అవసరమే. అది రాజకీయ నాయకలు నుంచి మొదలు కావాలి. మోడీ ఒక నిర్ణయం తీసుకుని పార్లమెంటులో చట్టం చేయాలి. రాజకీయ నాయకుల జీతభత్యాలు, పెన్షన్లు ఎత్తేయాలి. విదేశీ టూర్లు, విమాన ఖర్చులపై ఆంక్షలు విధించాలి. ఉచిత పథకాలను ఎత్తేయాలి. అప్పుడే దేశం బాగుపడుతుంది. మోడీ కోరుకున్న ఖర్చుల తగ్గింపు ఆలోచన కార్యరూపం దాలుస్తుంది.

# విదేశీ మారక నిల్వలు పెంచడం ఎలా?

### దిగుమతులు దెబ్బతీస్తుంటే తెలియదా?
### ఎగుమతులను విస్మరించడంతోనే సమస్య



**న్యూఢిల్లీ,మే13 :** మనవిదేశా మారక నిల్వలు పెరగాలంటే ఎగుమతులు పెరగాలి. దిగుమతలు తగ్గాలి. ఈ సూత్రాన్ని పాటించాల్సిన పాలకులు దీనిని పట్టించుకోవడం లేదు. పంటల దిగుబడి పెరుగు తున్నా వాటిని ఆదయ వనరుగా మార్చుకోవడంలో కేంద్రం విఫలం అవుతోంది. విదేశీమారక నిల్వలు తగ్గిపోతుంటే విదేశీ పెట్టుబడిదారులు ఆ దేశంలో తాము పెట్టిన పెట్టుబడులను వెనక్కి తీసేసుకుంటారు. సాధారణంగా 7-10 నెలలపాటు ముడిచమురు దిగుమతులకు సరిపడా విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఉంటే ఆ దేశ పరపతి బాగున్నట్టుగా అంచనా వేస్తారు. 1991లో మన దేశం వద్ద కేవలం 2 వారాలకు సరిపడా మాత్రమే విదేశీ మారక ద్రవ్య నిల్వలున్నాయి. అందుకే మన బంగారాన్ని లండన్‌కి పంపి తాకట్టు పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ఆనాటి చంద్రశేఖర్ ప్రభుత్వం బంగారం తాకట్టు పెట్టింది. పివి నరసింహారావు ప్రధాని అయ్యాక ఆర్థిక సంస్కరణలు చేపట్టడంతో దేశం దారికి వచ్చింది. తాకట్టు పెట్టిన బంగారాన్ని వడిపంచుకోగలిగాం. దీంతో మళ్లీ మనదేశ ఆర్థిక వ్యవస్థ గాడిన పడిందంటే ఆ మహానుభావుడి చొరవే కారణం. ఇప్పుడు మోడీ కూడా అలాంటి చొరవ లేదా సంస్కరణలకు దిగాలి. మూడీస్, ఎస్ అండ్ పి, ఫిచ్ వంటి అంతర్జాతీయ సంస్థలు.. ఫారెక్స్ రిజర్వ్ ఎక్కువగా ఉన్న దేశాలకు మంచి రేటింగ్ ఇస్తాయి. ఆ రేటింగ్ ఎంత ఎక్కువ ఉంటే అంత తక్కువ వడ్డీకి అప్పులు లభిస్తాయి. ఒక దేశం విదేశాల నుంచి అప్పు తీసుకోవాలనుకుంటే.. ఆయా దేశాలు సదరు దేశం వద్ద విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఎంత ఉన్నాయనే విషయాన్నే చూస్తాయి. ఇప్పుడు మన వద్ద విదేశీ మారక ద్రవ్య నిల్వలు దాదాపు 9 నుంచి 11 నెలలకు సరిపడా ఉన్నప్పటికీ.. పరిస్థితులు మన చేతుల్లో లేవు. పశ్చిమాసియాలో యుద్ధం ఇప్పట్లో ముగిసేలాగా కనిపించట్లేదు. ముడిచమురు ధరల భారంతోపాటు.. ఎరువుల ధరలు కూడా భారీగా పెరిగిపోయే ప్రమాదం కనపడుతోంది. అంటే వాటి దిగుమతుల కోసం చేయాల్సిన ఖర్చు మరింతగా పెరిగిపోయి డాలర్ల రిజర్వు అనుకున్నదానికంటే వేగంగా కరిగిపోయే ముప్పుంది. దీనికితోడు.. మనకు వచ్చే విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో ఎక్కువ భాగం గల్ఫ్ దేశాల నుంచి వచ్చేవే. అక్కడున్న భారతీయులు మనదేశంలో ఉన్న తమ కుటుంబసభ్యులకు పంపే డబ్బు కారణంగా విదేశీ మారకం భారీగా పెరిగింది.. యుద్ధం దెబ్బకు అతలాకుతలమైన గల్ఫ్ దేశాల్లో ఉంటున్న మనవాళ్లు పంపే డబ్బు తగ్గిపోతోంది. దీనికితోడు.. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో మన ఎగుమతులకు, తద్వారా మనకు రావాల్సిన డాలర్లకు కూడా ఆటంకం కలుగుతోంది. ఒకవైపు మనకు రావాల్సిన విదేశీ మారక ద్రవ్యంలో కోత పడుతుండగా, మరోవైపు మన వద్ద ఉన్న నిల్వలు కరిగిపోతున్నాయి. 2025-26 బడ్జెట్ అంచనాల ప్రకారం, దేశ జాతీయ రుణం అక్షరాలా రూ.235.4 లక్షల కోట్లు. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే నాటికి మన అప్పు కేవలం రూ.54.9 లక్షల కోట్లు మాత్రమే. అంటే, కేవలం పదేండ్ల కాలంలో దేశం చేసిన అప్పు 4.3 రెట్లు పెరిగింది. ప్రతి భారతీయుడిపై సగటున రూ.1.66 లక్షల అప్పు ఉన్నది. జీడీపీలో అప్పు నిష్పత్తి 67 శాతం నుంచి 83.9శాతానికి చేరుకున్నది. భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని పాలకులు గర్వంగా చెప్తుంటారు. 3.73 ట్రిలియన్ల డాలర్ల జీడీపీతో మనం ఆ స్థానంలో ఉన్నమాట నిజమే. కానీ, ఇందులో ఒక పెద్ద మాయ ఉన్నది. ఒక దేశం ఎంత ధనవంతమైనదో చెప్పాల్సింది దాని మొత్తం ఆదాయం కాదు, ఆ దేశ పౌరుడి తలసరి ఆదాయం. దేశ ఆర్థిక శక్తిని తలసరి ఆదాయపరంగా విశ్లేషిస్తే విస్తుపోయే వాస్తవాలు కనిపిస్తాయి. ఆదాయ పంపిణీలో ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మనం ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నామని, సంపద కేవలం పైస్థాయిలోనే కేంద్రీకృతమై సామాన్యుడి వరకు ఆశించిన స్థాయిలో చేరటం లేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఒక్క అమెరికన్ సంపాదన మన దేశంలోని 30 మంది పౌరుల మొత్తం ఆదాయంతో సమానం. జనాభాపరంగా మనం పెద్ద దేశం కాబట్టి జీడీపీ పెద్దదిగా కనిపిస్తుంది. కానీ పౌరుడి జీవన ప్రమాణాల విషయానికి వస్తే ఐఎంఎఫ్ లెక్కల ప్రకారం మనం ప్రపంచంలో 136వ స్థానంలో ఉన్నాం. 2014 ఎన్నికల సమయంలో రూపాయి విలువ పడిపోతుంటే అప్పటి పాలక వర్గాన్ని బీజేపీ తీవ్రంగా విమర్శించింది. అప్పుడు డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ.60. ఇప్పుడు అది రూ.94 దాటిపోయింది. పదేండ్లలో రూపాయి విలువ 40శాతం పైగా కుప్పకూలింది. రూపాయి బలహీనపడటం అంటే మనం విదేశాల నుంచి కొనే పెట్రోల్, డీజిల్, వంట నూనె ధరలు పెరగటం. ఈ భారం నేరుగా సామాన్యుడి వంటగదిపై పడుతున్నది. దేశానికి వెన్నెముక వంటి యువత ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో ఉన్నది. ప్రతి ఏటా కోటిన్నర మంది ఉద్యోగ మార్కెట్‌లోకి వస్తుంటే, ప్రభుత్వం సృష్టిస్తున్న అవకాశాలు కేవలం కొన్ని లక్షలు మాత్రమే. ఆర్థిక వ్యవస్థను ప్రక్షాళన చేస్తామని చెప్పి చేపట్టిన నోట్ల రద్దు దేశాన్ని కుదిపేసింది. జీఎస్టీ అమలు ఒకే దేశం ఒక పన్ను అనేది వినటానికి బాగున్నా, దాని సంక్లిష్టమైన స్లాబ్‌లు చిన్న వ్యాపారులకు శాపంగా మారాయి. కోట్లాది చిన్న తరహా పరిశ్రమలు మూతపడ్డాయి. కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య ఆదాయ పంపిణీ గొడవలు నిత్యకృత్యమయ్యాయి. అచ్చే దిన్ అనేది కేవలం ఎన్నికల నినాదంగానే మిగిలిపోయింది.

# తమిళ సిఎం విజయ్ సంచలన నిర్ణయం

- బడులు, గుడులు,బస్టాండ్ల వద్ద వైన్ షాప్‌ల ఎత్తివేత
- రెండువారాల్లోగా మూసేయాలంటూ ఆదేశాలు
- విజయ్ సోషల్ మీడియాకు పెరుగుతున్న ఆదరణ



**చెన్నై,మే12 :** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలు, దేవాలయాలు, బస్‌స్టాండ్స్‌కి 500 మీటర్ల దూరంలో ఉన్న 717 వైన్ షాపులన్నిం టినీ క్లోజ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. తమిళనాడు రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ దుకాణాలను రెండు వారాల్లోగా మూసివేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత విజయ్ జారీ చేసిన తొలి ఉత్తర్వు ఇది. ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలో టాస్మాక్ 4,765 మద్యం దుకాణాలను నిర్వహిస్తోంది. వీటిలో 276 మద్యం దుకాణాలు ప్రార్థనా స్థలాల సమీపంలో, 186 విద్యా సంస్థల సమీపంలో, 255 బస్ స్టాండ్‌ల సమీపంలో ఉన్నాయి. వీటిని వెంటనే తొలగించాలని సీఎం ఆదేశించారు. కాగా మద్యం అమ్మకాల ద్వారానే రాష్ట్రానికి భారీగా ఆదాయం సమకూరుతోంది. అయినప్పటికీ.. ప్రజా సంక్షేమం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తమిళనాడు ప్రభుత్వం వెల్లడించింది. 2025 సంవత్సరంలో మద్యం అమ్మకాల ద్వారా రాష్ట్రానికి రూ.48,000 కోట్ల ఆదాయం వచ్చినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఇకపోతే తమిళనాట దళపతి విజయ్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వయసుతో సంబంధం లేకుండా అన్ని వర్గాల్లో ఆయనను అభిమానించే వారు ఉన్నారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ ఏకంగా 108 స్థానాల్లో విజయం సాధించింది. రెండు రోజుల క్రితం విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ముఖ్యమంత్రి హోదాలో అసెంబ్లీకి వెళ్లారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే తమిళనాడు సీఎంఓ ఆఫీస్ సోషల్ మీడియా ఖాతాల డీపీలు మారాయి. ముఖ్యమంత్రి విజయ్ ఫొటోలను డీపీలుగా పెట్టారు. విజయ్ ఫొటో డీపీగా పెట్టిన గంటల్లోనే మ్యాజిక్ జరిగింది. సోషల్ మీడియా ఖాతాలకు ఫాలోవర్స్ క్యూ కట్టారు. తమిళనాడు సీఎంఓ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు మొదట 4 లక్షల ఫాలోవర్స్ ఉండేవారు. విజయ్ ఫొటో పెట్టిన తర్వాత 16 లక్షలకు ఫాలోవర్స్ సంఖ్య పెరిగింది. ఇక ఎక్స్ ఖాతాకు కూడా 4 లక్షల మంది ఫాలోవర్స్ ఉండేవారు. ఇప్పుడు 22 లక్షల మంది అయ్యారు. అందుకే ఆయన తీసుకునే నిర్ణయాలకు ప్రజలు జై కొడుతున్నారు.

# భారీగా తగ్గిన ప్రధాని కాన్వాయ్ వాహనాలు



- ఇంధన పొదుపుకోసం రెండు కార్లతో మోడీ పయనం
- ఢిల్లీ వీధుల్లో కనిపించిన దృశ్యాలు

**న్యూఢిల్లీ,మే13 :** ప్రధాని మోదీ చెప్పినట్లుగానే తన భద్రతా కాన్వాయ్ కి సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. తన భద్రతా కాన్వా య్ లో వాహనాల సంఖ్యను భారీగా తగ్గిం చారు. ఇంధనం పొదుపుకోసం తన కాన్వాయ్ లో 50 శాతం వాహనాలను తగ్గించాలని ఆదే శించిన కొద్దిగంటల్లో అమలు చేసారు. కేవలం రెండు కార్ల కాన్వాయ్ తో ప్రయాణం చేస్తు న్నారు. ప్రధాని మోదీ కాన్వాయ్‌లో కేవలం రెండు వాహనాలు మాత్రమే కనిపిం చడం చర్చనీయాంశమైంది.ఢిల్లీ వీధుల్లో ప్రధాని మోదీ కాన్వాయ్ దృష్యాలు కనిపించాయి. వీటికి సంబంధించిన వీడియో వైరల్ అవు తోంది. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా సంక్షోభ పరిస్థితులు ఉన్నాయని.. ఏడాది పాటు పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఇంధన వినియోగాన్ని తగ్గించడం లక్ష్యంగా.. తన కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను 50 శాతం తగ్గించాలని ప్రధాని మోదీ ఆదేశించారు. ప్రధానికి భద్రతగా ఉండే స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ లోని కాన్వాయ్‌లో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్యను పెంచాలని ప్రధాన మంత్రి సూచించారు. ఇందు కోసం కొత్త వాహనాలను కొనొద్దని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, రాజస్థాన్ సీఎం భజన్ లాల్ శర్మ, ఎంపీ సీఎం మోహన్ యాదవ్‌లతో సహా ఇతర మంత్రులు కూడా తమ అధికారిక కాన్వాయ్‌లలో వాహనాల సం ఖ్యను తగ్గించుకున్నారు. అనవసర ప్రయాణా లను తగ్గించాలని, జాతీయ వనరులను పరిరక్షించాలని ప్రధాని ఇటీవల పిలుపునిచ్చిన క్రమంలో బాధ్యతాయుతమైన ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడం, పరిపాలనా పరమైన పొదుపు చర్యలు చేపట్టడం వంటి విస్తృత ప్రయత్నాలలో భాగంగా ఈ చర్యను పరిగణిస్తున్నారు.

# విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్

- తమిళనాడు అసెంబ్లీలో 144 మంది మద్దతు
- విశ్వాస పరీక్షను బహిష్కరించిన డిఎంకె
- అనడిఎంకె చీలిక వర్గం టివికెకు అనుకూల ఓటు
- ప్రజల విశ్వాసాన్ని కాపాడుకుంటామన్న సిఎం విజయ్









**చెన్నై,మే13 :** తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ తన బలాన్ని నిరూపించుకున్నారు. బుధవారం జరిగిన బలపరీక్షలో 144 మంది ఎమ్మెల్యేలు అధికార టీవీకే పార్టీకి అనుకూలంగా ఓటు వేశారు. మరో 22 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. ఐదుగురు ఎమ్మెల్యేలు తటస్థంగా ఉన్నారు. ఈ సందర్భంగా మూజువాణి ఓటుకు బదులుగా స్పీకర్ సభలో ఒక్కో సభ్యుడి మద్దతు గురించి అడిగి తెలుసుకుని వారి ఓటును నమోదు చేసుకున్నారు. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు, వీసీకే, ఐయూఎమ్‌ఎల్ పార్టీల ఎమ్మెల్యేలు టీవీకేకు అనుకూలంగా ఓటు వేశారు. అన్నాడీఎంకేకు చెందిన పలువురు రెబెల్ ఎమ్మెల్యేలూ విజయ్‌కు మద్దతుగా నిలిచారు. ఇక డీఎంకే ఈ విశ్వాసపరీక్షను బహిష్కరించింది. పార్టీకి చెందిన 59 మంది ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. దీంతో, సభలో సభ్యుల సంఖ్య తగ్గి మ్యాజిక్ మార్కులో కూడా ఆ మేరకు కోత పడింది. ఈ క్రమంలో బలపరీక్షలో సీఎం విజయ్ సులువుగా నెగ్గారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ ప్రసంగిస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వంలో అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ప్రజలను నమ్ముకునే ఎన్నికల బరిలోకి దిగామని గుర్తు చేసుకున్నారు. అన్ని వర్గాలకు తమపై నమ్మకం ఉందని అన్నారు. తమను గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇక టీవీకేకు మద్దతిచ్చిన అన్నాడీఎంకే రెబెల్ ఎమ్మెల్యేల తరపున సీనియర్ నేత వేలుమణి మాట్లాడుతూ తాము ఎలాంటి మంత్రి పదవులనూ ఆశించట్లేదని అన్నారు. ప్రలోభాలు చూపించి మద్దతు కూడగట్టాల్సిన అవసరం తమకు లేదని సీఎం విజయ్ ఈ సందర్భంగా బదులిచ్చారు. తమ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతిచ్చిన పార్టీలకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. మా ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఉంటుంది. లౌకిక విధానాన్ని అవలంబిస్తూ పాలన సాగిస్తాం. గత ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తాం. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టిసారిస్తాం. అందరికీ సామాజిక న్యాయాన్ని అందించే బాధ్యత మాది‘ అని విజయ్ పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా ఓఎస్‌డీ నియామకంపై వచ్చిన విమర్శలపై స్పందిస్తూ.. దాన్ని పునఃసమీక్షిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రికి ప్రత్యేక విధుల అధికారి గా రిక్కి రాధన్ పండిట్ వెట్రివేల్‌ను నియమించడంపై పలు పార్టీల నుంచి వ్యతిరేకత ఎదురైంది.అంతకుముందు చర్చ సందర్భంగా శాసనసభలో ఒకింత గందరగోళం నెలకొంది. అన్నాడీఎంకే అధినేత, మాజీ సీఎం పళనిసామి మాట్లాడుతూ.. విజయ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. తమ ఎమ్మెల్యేలకు ఆయన డబ్బులు ఆఫర్ చేశారని ఆరోపించారు. బలపరీక్షకు ముందు తమ పార్టీ ఎమ్మెల్యేలను సీఎం కలవడం సమంజసం కాదని పేర్కొన్నారు. అన్నాడీఎంకే పార్టీ ఐక్యంగానే ఉందని.. తమ ఎమ్మెల్యేలంతా విజయ్‌కు వ్యతిరేకంగా ఓటేస్తారని పళనిస్వామి తెలిపారు. అయితే, ఈ వ్యాఖ్యలను అన్నాడీఎంకే రెబల్ వర్గం ఎమ్మెల్యేలు ఖండించారు. తామంతా విజయ్‌కే మద్దతిస్తామని రెబల్ వర్గం నేత వేలుమణి స్పష్టంచేశారు.ఇక చర్చలో డీఎంకే ఎమ్మెల్యే ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ విజయ్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ‘ఈ రాష్ట్రానికి రియల్ ప్రభుత్వం కావాలి. రీల్ ప్రభుత్వం కాదు. టీవీకే ప్రభుత్వానికి మెజార్టీ లేదు. మా కూటమిలోని పార్టీలు ఇప్పుడు మద్దతివ్వడం వల్లే విజయ్ గట్టెక్కగలుగుతున్నారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఎమ్మెల్యేల కొనుగోళ్లకు పాల్పడ్డారు. దీనివల్ల రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటోంది‘ అని ఉదయనిధి విమర్శించారు. విజయ్‌ను రాష్ట్రంలో మెజారిటీ ప్రజలు తిరస్కరించారని అన్నారు. విశ్వాసపరీక్ష సందర్భంగా అన్నాడీఎంకే మద్దతును కొనుగోలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయని అన్నారు. ఇప్పటివరకూ డీఎంకే అమలు చేసిన పథకాలను కొనసాగించాలని కూడా డిమాండ్ చేశారు.అనంతరం బలపరీక్ష ఓటింగ్‌లో తాము పాల్గొనబోమంటూ సభ నుంచి డీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు.234 శాసనసభ స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ 108 స్థానాల్లో గెలుపొందింది. ఇందులో విజయ్ రెండుచోట్ల పోటీ చేశారు. డీఎంకే 59, అన్నాడీఎంకే 47 చోట్ల గెలుపొందింది. కాంగ్రెస్ 5, పీఎంకే 4, ఐయూఎంఎల్ 2, సీపీఐ 2, వీసీకే 2, సీపీఎం 2, భాజపా 1, డీఎండీకే 1, ఏఎంఎంకే 1 చోట విజయం సాధించాయి.

## కార్పొరేట్ పాఠశాలలకు

# ధీటుగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్




**-పాఠశాలలు సమాజానికి బలమైన పునాదులు**

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

తెలంగాణ పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను చేరువ చేస్తూ, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను' తీర్చిదిద్దుతోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.

బుధవారం వేములవాడ పట్టణ పరిధిలోని నాంపల్లిలో నిర్వహించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' విద్యా వారోత్సవాల్లో భాగంగా నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధుల కార్యశాలకు విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు సదస్యులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

?ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని అన్నారు . ముఖ్యమంత్రి స్వయంగా విద్యాశాఖను పర్యవేక్షిస్తూ, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను తీర్చిదిద్దుతున్నారని అన్నారు . ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో రూ. 200 కోట్ల వ్యయంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో పూర్తయిన స్కూల్‌ను సందర్శించామని, అదే తరహాలో రాష్ట్రవ్యాప్తంగా అద్భుతమైన మౌలిక వసతులు, క్రీడా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు .

?ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత విద్యుత్, ఇంటర్నెట్, యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు అందిస్తున్నామని విప్ తెలిపారు. 'అమ్మ ఆదర్శ పాఠశాల' కమిటీల ద్వారా మౌలిక సదుపాయాల కల్పన జరుగుతోందని, ఇటీవలే డీఎస్సీ ద్వారా 10,006 మంది ఉపాధ్యాయులను నియమించి బోధనను బలోపేతం చేశామన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు వచ్చే విద్యా సంవత్సరం నుండి అల్పాహారం కూడా అందించనున్నమని అన్నారు .

?ప్రజాప్రతినిధులు తరచుగా పాఠశాలలను సందర్శించాలని, సర్పంచులు, కౌన్సిలర్లు వార్డుల్లోని స్కూళ్లకు అండగా నిలవాలని సూచించారు. పేరెంట్-టీచర్ సమావేశాల్లో పాల్గొంటూ విద్యార్థుల అవసరాలను గుర్తించాలని, తద్వారా తల్లిదండ్రులకు ప్రభుత్వ విద్యపై నమ్మకం పెరిగి ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు ఇటువైపు మొగ్గు చూపుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. పాఠశాలల పరిసరాల్లో పచ్చదనం, పరిశుభ్రత ఉండేలా చూడాలని, ప్రతి బిడ్డ ఉజ్వల భవిష్యత్తుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈఓ జగన్మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ,మార్కెట్ కమిటీ చైర్మన్ రోశీడి రాజు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్లు తాళ్లపల్లి ప్రభాకర్, బొజ్జ మల్లేశం,కొనరావుపేట సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బోయిని దేవరాజు, పలు మండలాల డీఈఓలు, గ్రామాల సర్పంచులు మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు...



## గంభీరావుపేట మండలంలో ఘోర ప్రమాదం

**స్కార్పియో ఢీకొని మహిళ మృతి.. ఇద్దరికీ గాయాలు..**

**బలగం టీవీ, గంభీరావుపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల పరిధిలోని గజసింగవరం స్టేజీ వద్ద బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అతివేగంగా వచ్చిన ఓ స్కార్పియో వాహనం ప్రయాణికులను బలంగా ఢీకొనడంతో చల్ల లక్ష్మి (38) అనే మహిళ ప్రాణాలు కోల్పోగా, మరో మహిళతో పాటు ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డారు.? రాజేశ్వర్ నగర్ కాలనీకి చెందిన చెందిన చల్ల లక్ష్మి (38), భర్త వెంకట నరసయ్య దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వృత్తిరీత్యా కూలీ పనులు చేసుకునే లక్ష్మి, బుధవారం ఉదయం తన పని నిమిత్తం సిరిసిల్లకు వెళ్లేందుకు గజసింగవరం స్టేజీ వద్దకు చేరుకుంది. అక్కడ బస్సు కోసం వేచి చూస్తూ, బస్సు వస్తుండగా దానిని ఆపే ప్రయత్నం చేస్తుండగా.. పక్క నుంచి మహారాష్ట్ర రిజిస్ట్రేషన్ కలిగిన ఒక స్కార్పియో వాహనం అత్యంత వేగంగా వచ్చి అక్కడ ఉన్న వారిపైకి దూసుకెళ్లింది.?ఈ ప్రమాదంలో లక్ష్మితో పాటు పక్కనే గజ సింగవరం గ్రామానికి చెందిన రజిత, ఆమె కుమారుడు యశ్వంత్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆసుపత్రికి చేరుకునే మార్గమధ్యంలోనే లక్ష్మి పరిస్థితి విషమించి మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన మహిళను, బాలుడిని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం..

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం అవుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ అర్బన్ మండల పరిధిలోని చిర్లవంచ, గుర్రవానిపల్లె గ్రామాలతో పాటు వేములవాడ పట్టణంలోని పలు వార్డుల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేసిన, వారికి నూతన వస్త్రాలను అందజేశారు.అనంతరం గుర్రవానిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన బస్సు షెల్టర్‌ను ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## పిల్లలను రోడ్డు మీద వదిలేయకండి..

# ప్రభుత్వ కేంద్రాలకు అప్పగించండి..

**-అక్రమ మార్గాల్లో దత్తత తీసుకుంటే కఠిన చర్యలు.**

**-కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

పిల్లలను రోడ్డు మీద వదిలి వెయ్యవద్దని, పెంపకం భారం అనిపిస్తే ప్రభుత్వ శిశు సంరక్షణ కేంద్రాలకు అప్పగించలని,తద్వారా చట్టప్రకారం వారికి మంచి జీవితం లభిస్తుందని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు.బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ఇద్దరు చిన్నారులను నిబంధనల ప్రకారం దత్తతకు అందించారు. ఈ సందర్భంగా దత్తత తీసుకున్న తల్లిదండ్రులకు కలెక్టర్ అభినందనలు తెలుపుతూ, చిన్నారులను కన్నబిడ్డల కంటే మిన్నగా పెంచాలని, వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు.?అనంతరం కలెక్టర్ కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులకు దత్తత ఒక గొప్ప వరమని, అనాథలుగా ఉన్న చిన్నారులకు ఇది ఒక నూతన జీవితాన్ని ప్రసాదిస్తుందని పేర్కొన్నారు. దత్తత ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరగాలని,కేవలం కేంద్ర దత్తత వనరుల సంస్థ ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో చట్టబద్ధంగా పిల్లలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇతర అక్రమ మార్గాల్లో పిల్లలను దత్తత తీసుకుంటే, అది నేరమని అటువంటి వారికి ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరించారు.పిల్లలను నిర్లక్ష్యం చేసినా, వదిలివేసినా లేదా అందుకు ప్రోత్సహించినా జువైనల్ జస్టిస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దత్తత తీసుకున్న వారు పిల్లల సంరక్షణ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, తద్వారా ఆ చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపాలని



ఆకాంక్షించారు.సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జిల్లా బాలల ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎన్ఐసీ ఎం గగన్ కుమార్ పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బంది కలగనివ్వద్దు.. లారీల సంఖ్య పెంచండి..

**-కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

రైతులకు ఇబ్బంది కలగనివ్వద్దని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి అనుగుణంగా లారీల సంఖ్యను పెంచాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బుధవారం కోనరావుపేట మండలం మర్తనపేట, నాగారం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల్లోని రికార్డులను, ధాన్యం రాశులను పరిశీలించారు. రైతులకు అందుబాటులో ఉన్న తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్ల సౌకర్యంపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేసి, వెంటనే మిల్లులకు తరలించాలని అధికారులకు సూచించారు. మిల్లర్లు కూడా తమ వద్ద హమాలీల సంఖ్యను పెంచుకుని, ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియలో జాప్యం లేకుండా చూడాలని అన్నారు .

వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వాతావరణ శాఖ ఇచ్చే హెచ్చరికలను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేయాలని, ధాన్యం తడవకుండా తగినన్ని టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

తనిఖీలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, మేనేజర్



నరసింహ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రం చెలగాటం..

**-సిరిసిల్లలో బీఆర్ఎస్వీ భారీ ధర్నా**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ అన్నారు . నీట్ పరీక్షల రద్దుకు నిరసనగా బుధవారం సిరిసిల్లలోని చేనేత షాప్ వద్ద బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ, వేలాది మంది విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివి తమ భవిష్యత్తుపై గంపెడంత ఆశలు పెట్టుకుంటే, పరీక్షల నిర్వహణలో కేంద్రం పూర్తిగా విఫలమైందని అన్నారు . పరీక్షలను రద్దు చేసే పరిస్థితి తీసుకురావడం అత్యంత దుర్మార్గమని, ఇది కేంద్ర ప్రభుత్వానికే సిగ్గుచేటని అన్నారు . ప్రశ్నాపత్రాల లీకులు, విచ్చలవిడి అవినీతి మరియు నిర్వహణ లోపాలు ఎన్డీఏ ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనాలని ఆరోపించారు. యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే హక్కు ఎవరికీ లేదని , దేశ విద్యా వ్యవస్థను గందరగోళానికి గురిచేసిన కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విద్యార్థులకు తగిన న్యాయం చేయకపోతే బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు మట్టి శ్రీనివాస్, అరెల్లి వినయ్ కుమార్, సదుల శేఖర్, ఎండి అజ్జు, బల్యాల ప్రవీణ్, బైకని వేణుగోపాల్ యాదవ్, లింగంపల్లి అబ్బి, పవన్, లక్ష్మణ్, మడుపు ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

# నీట్ పేపర్ లీకేజీ కేంద్ర ప్రభుత్వ అసమర్థతకు పరాకాష్ఠ..



**సెంటిమెంట్ రాజకీయం వద్దు బండి సంజయ్.. విచారణకు సహకరించండి..**

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న నీట్ పరీక్షా పత్రం లీకేజీ వ్యవహారం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు . బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఏకంగా జాతీయ స్థాయి పరీక్షను రద్దు చేయాల్సిన దుస్థితి రావడం కేంద్రానికి సిగ్గుచేటని, పకడ్బందీగా పరీక్షలు నిర్వహించడం చేతకాని వైఫల్యం వల్లే కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

దేశవ్యాప్తంగా వైద్యులు కావాలని కలలు కంటున్న సుమారు 23 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో కేంద్రం ఆటలాడుతోందని అన్నారు . కేవలం ఒక రాష్ట్రానికే పరిమితం కాకుండా, తెలంగాణ వ్యాప్తంగా 71 వేల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ లీకేజీ వల్ల తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని పేర్కొన్నారు. పరీక్షకు ముందు రోజే ప్రశ్న పత్రం లీక్ కావడం వ్యవస్థలోని దారుణమైన లోపాలను బయటపెట్టిందని, ఈ వైఫల్యానికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహిస్తూ తక్షణమే విద్యార్థులకు, తల్లిదండ్రులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణలో గత పదేళ్లలో ఒక్క నోటిఫికేషన్ సక్రమంగా ఇచ్చిన దాఖలాలు లేవని, ఒకవేళ ఇచ్చినా పరీక్షకు ముందే పేపర్ లీక్ చేయడం వారి అలవాటుగా మారిందని అన్నారు . దానికి భిన్నంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే 70 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టిందని, ఒక్క పేపర్ కూడా లీక్ కాకుండా పకడ్బందీగా నిర్వహించి తమ ప్రభుత్వ సమర్థతను చాటుకున్నామని అన్నారు.

ప్రధాని మోదీ మూడవసారి బాధ్యతలు చేపట్టాక దేశపాలనలో పూర్తిగా విఫలమవుతున్నారని, బంగారం కొనుగోళ్లపై ఆంక్షలు వంటి నిర్ణయాలు వారి చేతకాని తనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. త్వరలోనే దేశంలో రాహుల్ గాంధీ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో అసలైన ప్రజా పాలన వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**చట్టం తన పని తాను చేసుకుపోతుంది**

చట్టం ముందు అందరూ సమానులేనని, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు విచారణకు సహకరించాలే తప్ప సెంటిమెంట్‌తో రాజకీయం చేయకూడదని అన్నారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హోదాలో ఉన్న వ్యక్తులు చట్టాన్ని గౌరవించాల్సిన అవసరం ఉందని, భావోద్వేగపూరిత ప్రసంగాలు చేయడం సరికాదని అన్నారు.

ఒకవైపు తన కుమారుడు తప్పు చేస్తే శిక్షించవచ్చని చెబుతూనే, మరోవైపు సుదీర్ఘ ప్రసంగాలతో సానుభూతి పొందే ప్రయత్నం చేయడం ద్వంద్వ వైఖరిని సూచిస్తోందని అన్నారు. మైనర్ సంబంధించిన అంశం కావడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే దీనిపై సమగ్ర విచారణకు ఆదేశించారని అన్నారు . బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి విచారణకు నేరుగా సహకరించి, కోర్టు తీర్పునకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు.విచారణాధికారులు వెల్లడించే నిజానిజాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని, చట్టం తన పని తాను చేసుకుపోయేలా సహకరించాలని సూచించారు. సెంటిమెంట్‌ను అడ్డుపెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలని చూడటం ప్రజాస్వామ్యంలో సరైన పద్ధతి కాదని అన్నారు.



## సాంస్కృతిక సారథి కళాకారుడి ఇంట పెళ్లి వేడుక..

## హాజరైన చైర్‌పర్సన్ డాక్టర్ వెన్నెల

**బలగం టీవీ, గంభీరావుపేట:**

తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు కమ్మరి తిరుపతి-లక్ష్మీ దంపతుల కుమార్తె సింధుజ మరియు మనోజ్ కుమార్ ల వివాహం రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం సముద్ర లింగాపూర్ గ్రామంలో జరుగగా, ఈ వేడుకకు తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ గద్దర్ వెన్నెల ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.?తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత డాక్టర్ వెన్నెల గద్దర్ తొలిసారిగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు విచ్చేయడంతో జిల్లా కళాకారులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా సాంస్కృతిక సారథి కళాకారులు డాక్టర్ గద్దర్ వెన్నెల ను శాలువాతో సత్కరించి, ఘనంగా సన్మానం చేశారు. ?ఈ వివాహ వేడుకలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన సాంస్కృతిక సారథి కళాకారులు ఎడమల శ్రీధర్ రెడ్డి, శ్రీరాముల రామచంద్రం, ఆకునూరి దేవయ్య, పూడూరి సంజీవ్‌లతో పాటు కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో కళాకారులు పాల్గొన్నారు.

## శ్రీవాణి టికెట్లపై అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు

- శ్రీవాణి టికెట్ బుకింగ్ సైట్‌ను హ్యాక్ చేయడం సాధ్యం కాదు
- టీటీడీ

**బలగం టీవీ, తిరుమల**

సామాజిక మాధ్యమాల్లో శ్రీవాణి ట్రస్ట్ టికెట్ల బుకింగ్‌కు సంబంధించి వస్తున్న వార్తలపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) స్పందించింది. కొంతమంది దళారులు భక్తులను తప్పుదోవ పట్టిస్తూ నకిలీ టికెట్లు విక్రయిస్తున్నారని పేర్కొంది. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

శ్రీవాణి దర్శన టికెట్లపై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని భక్తులు నమ్మవద్దని టీటీడీ విజ్ఞప్తి చేసింది. శ్రీవాణి ట్రస్ట్ టికెట్ల బుకింగ్ విధానాన్ని 2019 మే నెలలో ప్రవేశపెట్టినట్లు గుర్తు చేసింది. భక్తుల సూచనలు, సలహాలు, గత అనుభవాల ఆధారంగా 2024 జూన్ నుంచి మరింత పారదర్శకంగా సేవలు అందించేలా బుకింగ్ విధానాన్ని పటిష్ఠం చేసినట్లు వెల్లడించింది. శ్రీవాణి టికెట్ బుకింగ్ సైట్‌ను హ్యాక్ చేయడం లేదా వ్యవస్థలో చొరబడటం సాధ్యం కాదని టీటీడీ స్పష్టం చేసింది. భక్తులు అపోహలకు లోనుకాకుండా అధికారిక మార్గాల్లోనే టికెట్లు బుక్ చేసుకోవాలని సూచించింది.

కొంతమంది దళారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఆటో ఫిల్లింగ్, ఆటో కాపీయింగ్ వంటి పద్ధతుల ద్వారా వేగంగా వివరాలు నమోదు చేసి టికెట్లు బుక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపింది. ఇలాంటి అక్రమ చర్యలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ సంబంధిత ఐడీలను బ్లాక్ చేయడంతో పాటు అక్రమ బుకింగ్ విధానాలను నిరోధిస్తున్నామని పేర్కొంది. సాఫ్ట్‌వేర్‌ను నిరంతరం అప్‌డేట్ చేస్తూ ప్రత్యేక నిఘా ఉంచుతున్నట్లు టీటీడీ వెల్లడించింది.

# పాతాళంలోకి రూపాయి.. ఆందోళనలో మార్కెట్!

- చారిత్రక కనిష్ఠ స్థాయి 95.80కి పతనం.. ఆసియాలోనే 'వరస్ట్' పర్ఫార్మెన్స్
- ముడిచమురు సెగ, పశ్చిమాసియా ఉద్రిక్తతలతో కరెన్సీ విలవిల
- రంగంలోకి ఆర్బీఐ.. ఇంధన ధరల పెంపు తప్పదన్న గవర్నర్ సంజయ్ మల్హోత్రా
- దిగుమతుల భారం తగ్గించేందుకు పసిడి,
- వెండిపై సుంకం 16 శాతానికి పెంపు

**బలగం టీవీ, ముంబై**



దేశీయ కరెన్సీ రూపాయి విలువ మున్నెన్నడూ లేని విధంగా పాతాళానికి జారుకున్నది. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం, అంతర్జాతీయ మార్కెట్‌లో భగ్గుమంటున్న క్రూడాయిల్ ధరలు రూపాయి పతనానికి ప్రధాన కారణమయ్యాయి. ఫారెక్స్ మార్కెట్ చరిత్రలో రూపాయి ఈ స్థాయికి పడిపోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

**అల్లాడిన రూపాయి.. అండగా ఆర్బీఐ**

బుధవారం ట్రేడింగ్‌లో రూపాయి మారకం విలువ ఒకానొక దశలో (ఇంట్రాడే) 95.80 కనిష్ఠ స్థాయిని తాకింది. దిగుమతిదారులు డాలర్ల కోసం ఎగబడటంతో కరెన్సీ పతనం వేగవంతమైంది. అయితే, రూపాయిని ఆదుకోవడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రంగంలోకి దిగడంతో చివరికి కొంత కోలుకుని 95.66 వద్ద ముగిసింది. మంగళవారం నాడు రూపాయి ఏకంగా 40 పైసలు కోల్పోయి 95.68కి పడిపోయిన విషయం తెలిసిందే.

**ఆసియాలోనే అత్యంత బలహీనంగా..**

ఆసియా ఖండంలోని కరెన్సీలన్నింటిలో మన రూపాయి ప్రదర్శన అత్యంత అధ్వాన్నంగా (వరస్ట్ పర్ఫార్మెన్స్) ఉందని గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు కరెన్సీ విలువ ఏకంగా 6 శాతం మేర పతనమైంది. భవిష్యత్తులో రూపాయి విలువ 95.45 నుంచి 96.15 మధ్య ఊగిసలాడవచ్చునని డీలర్లు అంచనా వేస్తున్నారు.

**వడ్డన తప్పదు: ఆర్బీఐ గవర్నర్ హెచ్చరిక**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగితే దేశంలో ఇంధన ధరలను పెంచక తప్పదని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. స్విట్జర్లాండ్‌లో జరిగిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చమురు ధరల పెరుగుదల ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా ఉందని, అదనపు భారాన్ని తగ్గించుకోవాలంటే ఇంధన ధరలను సవరించడం ప్రభుత్వానికి అనివార్యమని పేర్కొన్నారు. ఫిబ్రవరి 28న అమెరికా–ఇరాన్ యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు కేంద్రం చమురు ధరలను మార్చలేదు.

**ప్రభుత్వ చర్యలు:**

పెరుగుతున్న దిగుమతుల భారాన్ని అరికట్టేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బంగారం, వెండి దిగుమతులపై సుంకాన్ని 16 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. ఇది పరోక్షంగా రూపాయి పతనానికి అడ్డుకట్ట వేయడానికి దోహదపడుతుందని భావిస్తున్నారు.

## వృద్ధ దంపతులను బెదిరించి...

- 60తులాల బంగారు ఆభరణాలు, 15 కేజీల వెండి, 3వేల డాలర్లు, విలువైన వస్తువుల అపహరణ
- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్‌లో ఘటన
- నేపాల్ గ్యాంగ్ కోసం పోలీసులు గాలింపు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇటీవల జూబ్లీహిల్స్‌లో విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్యను నేపాలీ గ్యాంగ్ హత్య చేయగా ఆ కేసు దర్యాప్తులో ఉండగానే తాజాగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అలాంటి ఘటనే మరొకటి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌకూర్ గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో విశ్రాంత ప్రొఫెసర్ మురళీమోహన్, ఆయన భార్య డాక్టర్ విజయలక్ష్మి నివాసముంటున్నారు. కొంతకాలంగా నేపాల్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు వారి ఇంట్లో పని మనుషులుగా చేరి నమ్మకం సంపాదించారు. దాదాపు 10 రోజుల క్రితం మరో మహిళను తమ బంధువుగా పరిచయం చేసి ఇంట్లోనే ఉంచారు. పూర్తి ప్రణాళికతో దోపిడీకి సిద్ధమైన నిందితులు, మంగళవారం తమలో ఒకరి పుట్టినరోజు వేడుకలంటూ వద్ధ దంపతులను నమ్మించారు. ఈ మేరకు పనిమనుషులకు చెందిన మరో నలుగురు వారింటికి వచ్చారు. రాత్రి భోజనం సమయంలో వెనక నుంచి వచ్చిన నేపాలీ గ్యాంగ్ వారిని బెదిరించింది. దాంతో వృద్ధ దంపతులు ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. మమ్మల్ని చంపకండి... మీకు ఏమీకావాలో తీసుకెళ్ళండి అంటూ ప్రధేయపడిన వినకుండా.. వారికి మత్తు మందు ఇచ్చి... బెడ్‌రూంలోకి తీసుకెళ్ళి కాళ్ళు, చేతులు కట్టేశారు. అనంతరం ఇంట్లోని బీరువాలను ధ్వంసం చేసి సుమారు 60 తులాల బంగారు ఆభరణాలు, 15 కేజీల వెండి వస్తువులు, 3 వేల డాలర్లు, ఇతర విలువైన వస్తువులను అపహరించి పరారయ్యారు. ఎవరికీ అనుమానం రాకుండా ఇంటికి తాళాలు వేసి ఆటోలో అక్కడి నుంచి పారిపోయారు. మత్తుమందు ప్రభావంతో



వద్ధ దంపతులు స్పృహ కోల్పోయి... మంగళవారం మధ్యాహ్నం వరకు తేరుకోలేదు. అనంతరం దంపతులు హెల్ప్... హెల్ప్ అంటూ అరవడంతో చుట్టుపక్కల వారు గమనించి ఇంటి తాళాలు పగులగొట్టి వారిని విడిపించారు. స్థానికులు వెంటనే 100కు డయల్ చేయడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సహాయంతో పరిశీలనలు చేపట్టి వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నమ్మకంగా ఉంటూ తమను ఇలా చేస్తారని అనుకోలేదని వద్ధులు విలపించారు. .

మల్కాజిగిరి సీపీ సుమతి, డీసీపీ శ్రీధర్, ఘటనా స్థలాన్ని బుధవారం ఉదయం సందర్శించారు. నిందితులు దొంగతనం తర్వాత ఆటోలో పరారైనట్టు గుర్తించారు. వీరు నకిలీ గుర్తింపు కార్డులతో పనిలో చేరినట్టు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ ముఠాలో మీనా బహదూర్ (అలియాస్ మమత) అనే పాత నేరస్తురాలు ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితులు ఇప్పటికే ఢిల్లీ మీదుగా నేపాల్ సరిహద్దు దాటి ఉండవచ్చని భావిస్తున్నారు. దొంగల కోసం జవహర్‌నగర్ పోలీసులు ఆరు ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

## ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య.

**బలగం టీవీ, హైదరాబాద్**



మాదాపూర్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల హాస్టల్‌లో విషాదం చోటుచేసుకుంది. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నల్గొండ జిల్లాకు చెందిన పూజా రెడ్డి ప్రస్తుతం మాదాపూర్ పర్వత్‌నగర్ సమీపంలోని శ్రీ చైతన్య సరస్వతి హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ చదువుతోంది. ఇంటర్ మొదటి సంవత్సరంలో 470 మార్కులకు గాను 389 మార్కులు సాధించిన ఆమె, బెటర్‌మెంట్ పరీక్షలకు సన్నద్ధమవుతున్నట్టు సమాచారం. అయితే చదువు ఒత్తిడి కారణంగా కొంతకాలంగా మానసిక ఆందోళనకు గురవుతున్న ఆమె మంగళవారం రాత్రి హాస్టల్ మూడో అంతస్తులోని గది నంబర్ 305లో ఎవరూ లేని సమయంలో చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. విద్యార్థిని తండ్రి గోపిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కష్ణమోహన్ తెలిపారు.

## విద్యార్థి లోకంలో 'నిశ్శబ్ద' విలయం..

- రికార్డు స్థాయిలో ఆత్మహత్యలు!
- 2024లో 14,488 మంది విద్యార్థుల బలవన్మరణం: ఎన్సీఆర్బీ నివేదిక
- పదేళ్లలో 1.15 లక్షల మంది బలి: 62.2 శాతం పెరిగిన మరణాల రేటు
- ఒత్తిడి, మానసిక సమస్యలే ప్రధాన కారణం..మహారాష్ట్రలో అత్యధిక కేసులు
- 2023తో పోలిస్తే గత ఏడాది 4.3 శాతం పెరుగుదల

**బలగం టీవీ, న్యూఢిల్లీ**



దేశ భవిష్యత్తును నిర్మించాల్సిన విద్యార్థి లోకం విద్యా ఒత్తిడి, మానసిక ఆందోళనల సుడిగుండంలో చిక్కుకుంటోంది. దేశంలో విద్యార్థుల ఆత్మహత్యల సంఖ్య ఆందోళనకర రీతిలో పెరుగుతోందని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరోతన తాజా నివేదికలో వెల్లడించింది. 2024 సంవత్సరంలో రికార్డు స్థాయిలో 14,488 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడినట్లు బుధవారం విడుదల చేసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

**పెరుగుతున్న మరణాల గ్రాఫ్**

2015 నుంచి 2024 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా మొత్తం 1,15,850 మంది విద్యార్థులు తనువు చాలించారు. గత పదేళ్ల కాలంలో విద్యార్థుల బలవన్మరణాల సంఖ్య 62.2 శాతం మేర పెరగడం గమనార్హం. 2023లో నమోదైన 13,892 కేసులతో పోలిస్తే, 2024లో ఈ సంఖ్య 4.3 శాతం అధికంగా నమోదైంది.

**గడిచిన ఐదేళ్ల గణాంకాలు ఇలా ఉన్నాయి:**

2020: 12,526 మంది
2021: 13,089 మంది
2022: 13,044 మంది
2023: 13,892 మంది
2024: 14,488 మంది

**అగ్రస్థానంలో మహారాష్ట్ర..**

దేశవ్యాప్తంగా నమోదైన మొత్తం కేసుల్లో అత్యధికంగా మహారాష్ట్రలో 13.2 శాతం మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో ఉత్తరప్రదేశ్ (10.9%), మధ్యప్రదేశ్ (10%), మరియు తమిళనాడు (8.9%) రాష్ట్రాలు ఉన్నాయి.

నిపుణుల విశ్లేషణ ప్రకారం.. విద్యాపరమైన ఒత్తిళ్లు, పరీక్షల భయం, మానసిక ఆరోగ్య సమస్యలు మరియు సరైన సహాయక వ్యవస్థలు అందుబాటులో లేకపోవడం వల్ల విద్యార్థులు ఈ అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. యువతలో పెరుగుతున్న ఈ ధోరణిని అరికట్టేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని సామాజికవేత్తలు కోరుతున్నారు

## సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ పదవీకాలం పొడిగింపు

**మరో ఏడాది కొనసాగనున్న కేంద్ర దర్యాప్తు సంస్థ అధిపతి**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**



కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) డైరెక్టర్ ప్రవీణ్ సూద్ పదవీకాలాన్ని మరో ఏడాదిపాటు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రవీణ్ సూద్ పదవీకాలం ఈ నెల 24తో ముగియనున్న నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. కేంద్ర అపాయింట్‌మెంట్స్ కమిటీ తరఫున క్యాబినెట్ కార్యదర్శి మనీషా సక్సేనా ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ప్రవీణ్ సూద్ 1986 బ్యాచ్ కర్ణాటక క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. ఆయనను 2023లో రెండేళ్ల కాలపరిమితితో సీబీఐ డైరెక్టర్‌గా నియమించారు. గత ఏడాది మేలో ఆయన పదవీకాలం ముగియగా మొదటిసారి పొడిగింపు ఇచ్చారు. తాజాగా మరోసారి కూడా ఆయన పదవీకాలాన్ని పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## మతం అంటే ఆచారమే కాదు.. అదొక అంతర్గత విశ్వాసం!

**హిందూ మతంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**



మతం అంటే కేవలం బయటకు కనిపించే ఆచారాలు మాత్రమే కాదని, అది మనిషి అంతర్గత విశ్వాసమని దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. శబరిమల వంటి ఆలయాల్లో మహిళలపై వివక్షకు సంబంధించిన పిటిషన్లపై విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం హిందూ ధర్మంపై అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేసింది.

ఒక వ్యక్తి తనను తాను హిందువుగా నిరూపించుకోవడానికి ప్రతిరోజూ గుడికి వెళ్లాల్సిన అవసరం లేదని సీజేఐ పేర్కొన్నారు. "ఎవరైనా ఇంట్లో ఒక చిన్న దీపం వెలిగించినా, అది ఆ వ్యక్తి మతాన్ని, ఆ దైవంపై ఉన్న విశ్వాసాన్ని చాటిచెప్పడానికి సరిపోతుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. మతం అనేది ఒక వ్యక్తి వ్యక్తిగత విశ్వాసమని రాజ్యాంగ ధర్మాసనం పునరుద్ఘాటించింది. ధర్మాసనంలోని మరో న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న మాట్లాడుతూ, హిందూ మతం అనేది ఒక పద్ధతికి లోబడిన మతం కాదని, అది ఒక విశిష్టమైన జీవన విధానమని అభివర్ణించారు. ఆచారాలను కచ్చితంగా పాటించాలన్న నిబంధన ఏమీ లేదని, ఆచారబద్ధంగా లేకపోయినా ఒక వ్యక్తికి మతంపై పూర్తి విశ్వాసం ఉండవచ్చని ఆమె స్పష్టం చేశారు. ప్రతి చిన్న మతపరమైన ఆచారాన్ని లేదా విషయాన్ని న్యాయస్థానాల్లో ప్రశ్నించే ధోరణిపై కోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి చర్యలు మతాల పతనానికి దారితీస్తాయని ధర్మాసనం హెచ్చరించింది. ఇటువంటి పిటిషన్ల వల్ల కోర్టులపై అనవసర భారం పెరగడమే కాకుండా, సమాజంలో మతపరమైన సామరస్యం దెబ్బతినే అవకాశం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

## రేవంత్, బండి 'చీకటి స్నేహం' వల్లే కేసు నిర్వీర్యం!

**ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్**

**బలగం టీవీ, వనపర్తి**



రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మైనర్ బాలికపై అఘాయిత్యం (పోక్సో కేసు) వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీజేపీ నేత బండి సంజయ్‌ల మధ్య ఉన్న 'చీకటి స్నేహం' కారణంగానే విచారణ బలహీనపడిందని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. బుధవారం వనపర్తిలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు బండి సాయి భగీరథ్‌ను పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని ఆర్.ఎస్.పీ డిమాండ్ చేశారు. నేరం చేసిన వ్యక్తి తండ్రికి నోటీసులు ఇవ్వకుండా, మేనమామకు ఇవ్వడంలో పోలీసుల ఔచిత్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కరీంనగర్ ఎస్పీని బెదిరించిన బండి సంజయ్ మీద తక్షణమే సుమోటో కేసు నమోదు చేయాలని కోరారు. బాధిత బాలిక కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేయడానికి వంశీ అనే వ్యక్తితో ఉద్దేశపూర్వకంగా ఫిర్యాదు చేయించారని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. బీజేపీ నేత సంగప్ప ద్వారా బాధితులకు, బండి సంజయ్ కుటుంబానికి సయోధ్య కుదిర్చేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. సోషల్ మీడియాలో బాధితురాలి ఫోటోలు పెట్టి ఆమె గౌరవానికి భంగం కలిగించారని మండిపడ్డారు. కరీంనగర్‌లో బాధితులపైనే రివర్స్ కేసులు నమోదు చేయడం అత్యంత సిగ్గుచేటని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించిన సిట్ దర్యాప్తు కేవలం కంటితుడుపు చర్యేనని ఆర్.ఎస్.పీ ఎద్దేవా చేశారు. రేపులు, మర్డర్లు చేసే వ్యక్తులకు నోటీసులు ఇవ్వడం ఏ చట్టంలో ఉందని సీఎంను, డీజీపీని నిలదీశారు. బండి సంజయ్ ఇంటిని పోలీసులు ఎందుకు సోదాలు చేయడం లేదని ప్రశ్నించిన ఆయన, ఆర్ఎస్ఎస్ మరియు బీజేపీలు న్యాయ వ్యవస్థలను ప్రభావితం చేస్తున్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ అఘాయిత్యాన్ని ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కూడా ఖండించాలని ఆయన కోరారు.

## పేపర్ లీక్‌లపై 'జెన్ జెడ్' మేల్కోవాలి

- బీజేపీ పాలనలో 93 సార్లు లీకేజీలు.. 6 కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనం
- సీబీఐ దర్యాప్తుపై అనుమానాలు
- బంగ్లాదేశ్, నేపాల్ తరహాలో యువత తిరగబడాలి
- ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ వీడియో సందేశం

**బలగం టీవీ, న్యూఢిల్లీ**




నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) పేపర్ లీక్ మరియు పరీక్ష రద్దు వ్యవహారంపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై ధ్వజమెత్తుతూ, అన్యాయం మరియు దుష్పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడాలని 'జెన్ జెడ్' (నేటి తరం యువత)కు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

**93 సార్లు పేపర్ లీక్.. డబుల్ ఇంజిన్ రాష్ట్రాల్లోనే ఎక్కువ!**

2014లో ప్రధాని మోదీ నేతృత్వంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 93 సార్లు పేపర్ లీక్‌లు జరిగినట్లు కేజ్రీవాల్ ఆరోపించారు. ఈ లీకేజీల్లో అత్యధికం రాజస్థాన్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్ వంటి బీజేపీ పాలిత (డబుల్ ఇంజిన్) రాష్ట్రాల్లోనే జరగడం గమనార్హమని ఆయన విమర్శించారు.

ప్రస్తుత నీట్ పేపర్ లీక్ కారణంగా సుమారు ఆరు కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని కేజ్రీవాల్ ఆవేదన వ్యక్తం చేశారు. "బంగ్లాదేశ్, నేపాల్‌లో ప్రభుత్వాలను గద్దె దింపగలిగిన జెన్ జెడ్.. మన దేశంలోని అవినీతి నాయకులను జైలుకు పంపలేరా?" అని ఆయన నిలదీశారు.

ప్రశ్నాపత్రాల లీకేజీలపై జరుగుతున్న దర్యాప్తు కేవలం కంటితుడుపు చర్యే అని ఆయన కొట్టిపారేశారు. ప్రతి ఏటా సీబీఐ కొంతమందిని అరెస్టు చేస్తున్నప్పటికీ, వారు తిరిగి విడుదలయ్యి మళ్లీ అదే కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సమగ్ర దర్యాప్తు జరిపితే తమకే ముప్పు వాటిల్లుతుందన్న భయంతోనే ఎన్డీయే ప్రభుత్వం వెనకాడుతోందని కేజ్రీవాల్ ఆరోపించారు.

## బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలి




**ప్రజా సంఘాల నాయకులు**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఫోక్సో కేసులో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథను వెంటనే అరెస్టు చేసి కోర్టులో రిమాండ్ చేయాలని ఐద్వా, పీఓడబ్ల్యూ, పీఓడబ్ల్యూ–2, ఏఐఎంఎస్ఎస్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, టీయూసీఎల్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్ లిబర్టీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ, బాధిత బాలిక తల్లి ఫిర్యాదు చేసి ఆరు రోజులు గడిచినా నిందితుడిని ఇప్పటివరకు ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు.17 ఏండ్ల బాలికను మానసికంగా, లైంగికంగా వేధిస్తున్నాడని కేసు నమోదైనప్పటికీ చర్యలు తీసుకోకపోవడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతు న్నాయన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన కుమారుడిపై వచ్చిన ఆరోపణలను కప్పిపుచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.దేశంలో చట్టాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉన్న కుటుంబంలోనే చట్ట ఉల్లంఘనకు పాల్పడుతున్నారని, ఇది మహిళల భద్రతకు ప్రమాదకర సంకేతమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నైతిక బాధ్యత వహిస్తూ బండి సంజయ్ కేంద్ర మంత్రి పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకులు సంధ్య మాట్లాడుతూ బండి భగీరథపై గతంలో కూడా ర్యాగింగ్, డ్రగ్స్ వినియోగం వంటి ఆరోపణలు సోషల్ మీడియాలో వెలుగుచూశాయని, అధికార అండతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ–2 రాష్ట్ర అధ్యక్షురాలు స్వరూప, ఏఐఎంఎస్ఎస్ రాష్ట్ర కన్వీనర్ హేమలత, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు హైమావతి, నాయకురాలు మాధవి, ఐద్వా సహాయ కార్యదర్శి ఆశాలత, పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు ఝాన్సీ, లక్ష్మీబాయి, వరలక్ష్మి, సీఎంఎస్ రాష్ట్ర నాయకురాలు జ్యోతి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

# కోల్‌కతా జైత్రయాత్రకు ఆర్‌సీబీ బ్రేక్!



- విరాట్ కోహ్లీ 'సెంచరీ' ధమాకా..
- కేకేఆర్‌పై 6 వికెట్ల తేడాతో ఘన విజయం
- ప్లేఆఫ్స్ రేసులో మరింత చేరువైన బెంగళూరు
- ఈ సీజన్‌లో 8వ విజయం నమోదు
- 92 పరుగుల కీలక భాగస్వామ్యంతో మెరిసిన కోహ్లీ-పడిక్కల్ ద్వయం
- కార్తీక్ త్యాగి పోరాటం వృధా..

**బలగం టీవి, రాయ్‌పూర్,**

ఐపీఎల్ 2026 సీజన్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న కోల్‌కతా నైట్ రైడర్స్ జోరుకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బ్రేక్ వేసింది. రాయ్‌పూర్ వేదికగా జరిగిన ఉత్కంఠ పోరులో ఆర్‌సీబీ 6 వికెట్ల తేడాతో కేకేఆర్‌పై ఘన విజయం సాధించింది. ఈ విజయంతో బెంగళూరు తన ప్లేఆఫ్స్ అవకాశాలను మరింత మెరుగుపరుచుకోగా, కోల్‌కతా వరుస నాలుగు విజయాల పరంపరకు తెరపడింది.

**కింగ్ కోహ్లీ సూపర్ సెంచరీ**

భారీ లక్ష్య చేధనలో విరాట్ కోహ్లీ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. అద్భుతమైన సెంచరీతో జట్టును ముందుండి నడిపించిన కోహ్లీ, ఆర్‌సీబీని విజయ తీరాలకు చేర్చాడు. ఆరంభంలో స్వల్ప వ్యవధిలో వికెట్ కోల్పోయినా, కోహ్లీ తన అనుభవంతో ఇన్నింగ్స్‌ను చక్కదిద్ది జట్టుకు విజయాన్ని అందించాడు.

**మలుపు తిప్పిన భాగస్వామ్యం**


లక్ష్య చేధనలో ఆర్‌సీబీకి ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. 12 బంతుల్లో 15 పరుగులు చేసిన జాకబ్ బెథల్, కార్తీక్ త్యాగి బౌలింగ్‌లో అవుట్ కావడంతో 37 పరుగులకే తొలి వికెట్ కోల్పోయింది. ఈ దశలో విరాట్ కోహ్లీ, దేవ్‌దత్ పడిక్కల్ జోడీ అద్భుత పోరాటం కనబర్చింది. వీరిద్దరూ కలిసి దాదాపు 10 ఓవర్ల పాటు క్రీజులో నిలబడ్డారు.రెండో వికెట్‌కు ఏకంగా 92 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టును పటిష్ఠ స్థితిలో నిలిపారు.

**త్యాగి పోరాటం..**

ఒకానొక దశలో ఏకపక్షంగా సాగుతున్న ఈ మ్యాచ్‌ను కేకేఆర్ బౌలర్ కార్తీక్ త్యాగి కాస్త ఆసక్తికరంగా మార్చాడు. అయితే, కోహ్లీ దూకుడు ముందు త్యాగి ప్రయత్నాలు ఫలించలేదు. ఆర్‌సీబీకి ఇది సీజన్‌లో 8వ విజయం కావడం విశేషం.

# ప్యాట్ కమిన్స్‌కు భారీ జరిమానా

**బలగం టీవి, న్యూఢిల్లీ**



ఐపీఎల్ 2026లో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఘోర ఓటమి చవిచూసిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అహ్మదాబాద్‌లో జరిగిన ఈ పోరులో జట్టు ప్రదర్శనపై విమర్శలు వస్తుండగానే, కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌పై బీసీసీఐ భారీ జరిమానా విధించింది. స్లో ఓవర్ రేట్ కారణంగా కమిన్స్ ఈ శిక్షకు గురయ్యారు. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత సమయంలో ఓవర్లను పూర్తి చేయలేకపోయింది. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం.. స్లో ఓవర్ రేట్ తప్పిదానికి పాల్పడినందుకు కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌కు రూ.12 లక్షల జరిమానా విధిస్తున్నట్లు బీసీసీఐ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ సీజన్‌లో హైదరాబాద్ జట్టుకు ఇది మొదటి తప్పిదం కావడంతో కేవలం జరిమానాతో సరిపెట్టారు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం, ఒక కెప్టెన్ పదే పదే ఈ తప్పిదాన్ని పునరావృతం చేస్తే కఠిన చర్యలు ఉంటాయి. జరిమానా మొత్తం రూ.25 లక్షలు దాటితే కెప్టెన్‌కు ఒక డీమెరిట్ పాయింట్ ఇస్తారు. అయితే 2025 సీజన్ నుంచి వచ్చిన మార్పుల ప్రకారం.. ఓవర్ రేట్ తప్పిదాల వల్ల నేరుగా నిషేధం విధించరు. ఒకవేళ ఒక సీజన్‌లో 5 డీమెరిట్ పాయింట్లు వస్తేనే సదరు కెప్టెన్ లేదా ఆటగాడిపై ఒక మ్యాచ్ నిషేధం పడే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం కమిన్స్ కేవలం ఒకసారే ఈ తప్పిదం చేశారు కాబట్టి ఆయన ఆడేందుకు ఎలాంటి అడ్డంకులు లేవు.కావ్య మారన్ నేతృత్వంలోని సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రస్తుతం 12 మ్యాచ్‌లలో 14 పాయింట్లతో పాయింట్ల పట్టికలో మూడవ స్థానంలో ఉంది. గుజరాత్ చేతిలో 82 పరుగుల తేడాతో ఓడిపోవడం జట్టు నెట్ రన్ రేట్‌పై ప్రభావం చూపింది. ప్లేఆఫ్స్ రేసులో ఉన్న సన్‌రైజర్స్‌కు ఇప్పుడు కెప్టెన్‌పై జరిమానా పడటం మానసికంగా కొంత ఇబ్బంది కలిగించే విషయమే. ఇదే సీజన్‌లో శ్రేయాస్ అయ్యర్ ఇప్పటికే రెండుసార్లు జరిమానా కట్టి రూ.36 లక్షలు చెల్లించడం గమనార్హం. రూ. 14 కోట్లకు రిటైన్ చేసుకున్న ప్యాట్ కమిన్స్, తదుపరి మ్యాచ్‌లలో జట్టును సమయానికి ఓవర్లు వేయించేలా నడిపించాల్సి ఉంటుంది. రాబోయే మ్యాచ్‌లలో మళ్ళీ ఈ పొరపాటు జరిగితే జరిమానా పెరగడమే కాకుండా డీమెరిట్ పాయింట్లు వచ్చే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఓటమితో డీలా పడ్డ కావ్య మారన్ సేన, ఈ నిబంధనల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# వైభవ్ సూర్యవంశీకి ఏబీ డివిలియర్స్ ఛాలెంజ్!




**బలగం టీవి, న్యూఢిల్లీ**

భారత క్రికెట్లో ప్రస్తుతం సెన్సేషన్‌గా మారిన 15 ఏళ్ల యువ కెరటం వైభవ్ సూర్యవంశీ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. ఐపీఎల్ 2025లో రాజస్థాన్ రాయల్స్ తరపున అరంగేట్రం చేసినప్పటి నుంచి విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి దిగ్గజాల మధ్య కూడా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. అద్భుతమైన హిట్టింగ్ సామర్థ్యం ఉన్న వైభవ్ ప్రతిభను మైఖేల్ వాన్, అలిస్టర్ కుక్ వంటి మాజీలు కొనియాడారు. త్వరలోనే వైభవ్ భారత సీనియర్ జట్టులోకి వస్తాడని అంతా భావిస్తున్నారు.అయితే ఆర్సీబీ లెజెండ్ ఏబీ డివిలియర్స్ మాత్రం వైభవ్ సూర్యవంశీ భవిష్యత్తుపై భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. స్టువర్ట్ బ్రాడ్, జోస్ బట్లర్ నిర్వహించిన 'ఫర్ ది లవ్ ఆఫ్ క్రికెట్' పాడ్‌కాస్ట్‌లో ఏబీ డివిలియర్స్ మాట్లాడుతూ.. వైభవ్ సూర్యవంశీ కెరీర్ సుదీర్ఘంగా సాగాలంటే అతను కేవలం టీ20లకు మాత్రమే పరిమితం కాకూడదని సూచించారు. "వైభవ్‌లో అద్భుతమైన ప్రతిభ ఉంది, కానీ అతను ఎక్కువ కాలం రాణించగలడా? అనే దానిపై నాకు అనుమానం ఉంది" అని ఏబీ డివిలియర్స్ స్పష్టం చేశాడు.ఏబీడీ దృష్టిలో టీ20 క్రికెట్, టెస్ట్ క్రికెట్ మధ్య చాలా తేడా ఉంటుంది. వైభవ్ సూర్యవంశీ తనను తాను కేవలం టీ20 స్పెషలిస్ట్‌గా మార్చుకుంటే అతని కెరీర్ విజయవంతంగా సాగుతుందని.. కానీ వన్డేలు, టెస్టుల్లోకి అడుగుపెడితే మాత్రం కఠినమైన సవాళ్లు ఎదురవుతాయని హెచ్చరించాడు. టెస్ట్ క్రికెట్‌లో మానసిక, శారీరక దృఢత్వం చాలా అవసరమని.. అక్కడ ఎదురయ్యే అడ్డంకులను అధిగమించడం అంత సులభం కాదని ఆయన అభిప్రాయపడ్డాడు. "వైభవ్ సూర్యవంశీకి అన్ని రకాల షాట్లు ఆడే సత్తా ఉంది, కానీ టెస్ట్ క్రికెట్ ఆడేటప్పుడు అతను తనలోని కొత్త కోణాన్ని కనుగొనాల్సి ఉంటుంది. అది ఒక గంభీరమైన ప్రయాణం లాంటిది. అతను ఆ సవాళ్లను దాటుకుని తన దేశం తరపున టెస్టులు ఆడాలని నేను కోరుకుంటున్నాను" అని డివిలియర్స్ ముగించాడు. మరి ఈ 15 ఏళ్ల వండర్ కిడ్, ఏబీడీ విసిరిన ఈ సవాల్‌ను స్వీకరించి భవిష్యత్తులో అన్ని ఫార్మాట్లలో రాణిస్తాడో లేదో వేచి చూడాలి.

# ప్రభ్‌సిమ్రన్ వినూత్న ప్రదర్శన

**బలగం టీవి, న్యూఢిల్లీ**



ఐపీఎల్ వర్గాల్లో పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ హాట్?టాపిక్?గా మారింది. వరుసగా నాలుగు ఓటములతో ప్లేఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టం చేసుకున్న ఆ జట్టు?పై విమర్శలు వస్తున్నాయి. ఇందులో గత మూడు మ్యాచ్?ల్లో ఓపెనింగ్ బ్యాటర్ ప్రభ్?సిమ్రన్ సింగ్ విఫలమయ్యాడు. దీంతో అతడు ఫిట్?నెస్ కోల్పోయాడని, కేవలం వారం రోజుల వ్యవధిలోనే 10 కేజీల బరువు పెరిగాడని విమర్శలు వస్తున్నాయి. ఈ విమర్శలకు ప్రభ్?సిమ్రన్ వినూత్నంగా చొక్కా లేకుండా దిగిన ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ రిప్లై ఇచ్చాడు.పంజాబ్ ఆడిన గత మూడు మ్యాచ్?ల్లో ప్రభ్?సిమ్రన్ స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరాడు. తొలుత గుజరాత్ టైటాన్స్?పై (15 పరుగులు) స్వల్ప స్కోరే చేసిన అతడు ఆ తర్వాత సన్?రైజర్స్ హైదరాబాద్?పై (03 పరుగులు), దిల్లీ క్యాపిటల్స్?(18 పరుగులు)పైనా ఫెయిల్ అయ్యాడు. దీంతో అతడిపై విమర్శలు వచ్చాయి. ప్రభ్?సిమ్రన్ ప్రాక్టీస్?ను నిర్లక్ష్యం చేశాడని, అందుకే గత వారం రోజుల్లోనే 10 కేజీల బరువు పెరిగాడని ఆరోపణలు వచ్చాయి. దీని వల్లే అతడు ఫామ్, ఫిట్?నెస్ కోల్పోయాడని ప్రచారం జరిగింది.అయితే ఈ ప్రచారాలకు తనదైన శైలిలో ప్రభ్?సిమ్రన్ రిప్లై ఇచ్చాడు. ఇన్?స్టాగ్రామ్ స్టోరీలో లేటెస్ట్ ఫొటో ఒకటి షేర్ చేస్తూ, తనపై వస్తున్న విమర్శలకు చెక్ పెట్టాడు. ఈ ఫొటోలో అతడు ధర్మశాల ప్రాంతంలో ఓ వాటర్ ఫాల్? దగ్గర చొక్కా లేకుండా తీసుకున్న ఫొటోను అప్లోడ్? చేశాడు. బ్యాగ్రౌండ్?లో కొండల మధ్యలో నుంచి నీళ్లు పారుతున్నాయి. దీనికి 'ష్' (నిశబ్దం) అనే ఇమోజీని జోడించాడు. ఇందులో అతడు తన శరీరాన్ని ఫ్లెక్స్? చేసి చూపిస్తున్నాడు. దీంతో తాను ఫిట్?గానే ఉన్నానని చెబుతూ, తనపై వస్తున్న విమర్శలకు ఇలా కౌంటర్ ఇచ్చాడని నెటిజన్లు అనుకుంటున్నారు! ఈ సీజన్?లో ఫస్ట్? హాఫ్?లో ప్రభ్?సిమ్రన్ బ్యాటింగ్?లో రాణించాడు. మెరుపు ఆరంభాలు అందిస్తూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఇప్పటిదాకా ఈ సీజన్?లో 10 ఇన్నింగ్స్?ల్లో అతడు 169 స్ట్రైక్ రేట్?తో 382 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు హాఫ్ సెంచరీలు ఉండడం విశేషం. అయితే గత మూడు మ్యాచ్?ల్లో విఫలమైన ప్రభుసిమ్రన్ ఇప్పటికైనా మునుపటి ఫామ్ అందుకోవం జట్టుకు అత్యంత కీలకం. అతడు ఫామ్?లోకి వచ్చి మంచి ఆరంభాలు ఇవ్వాలని పంజాబ్ కింగ్స్ ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.ప్రభ్?సిమ్రన్?తోపాటు జట్టుపై పలు విమర్శలు వచ్చాయి. టీమ్? ప్లేయర్ల మధ్య సమన్వయం దెబ్బతిన్నదని, ఆటగాళ్లలో క్రమశిక్షణ లోపించిందని, కొంతమంది ప్లేయర్లు ప్రాక్టీస్ సెషన్లకు డుమ్మా కొడుతున్నారని ఇలా పలు ఆరోపణలు వచ్చాయి. అయితే ఈ ఆరోపణలు, విమర్శలపై ప్రభ్?సిమ్రన్ కంటే ముందు ఫ్రాంచైజీ ఓనర్ ప్రీతి జింటా స్పందించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు మానుకోవాలని, లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.'విమర్శలు, అబద్ధపు ప్రచారానికి మధ్య చాలా తేడా ఉంది. ఆట పట్ల ఎలాండి డిబేట్?లు ఉన్నా మేం స్వాగతిస్తాం. కానీ, ఉద్దేశపూర్వకంగా రూమర్లను, తప్పుడు ఆర్టికల్స్?ను వ్యాప్తి చేస్తూ, మా జట్టుకు, మా ప్లేయర్ల పరువుకు భంగం కలిగించాలని ప్రయత్నిస్తే అస్సలు సహించబోము. ఆధారాలు లేని అసత్య ప్రచారాల్లో మీడియా కూడాఅప్రమత్తంగా, బాధ్యతగా ఉండాలని కోరుతున్నాను' అని ప్రీతి ఎక్స్?లో పోస్టు షేర్ చేశారు. అలాగే 'ఆటలో విమర్శలు, అభిప్రాయాలు వ్యక్తపర్చడం సాధారణమే. కానీ, చీప్ పబ్లిసిటీ కోసం తప్పుడు వార్తలు ప్రచారం చేయడం మాత్రం ఆటలో భాగం కానే కాదు. పాపులారిటీ కోసం రూమర్లు ప్రచారం చేసే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని కోరుతున్నాం' అని పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ పోస్టు చేసింది.

# రామకృష్ణ ఘోష్ స్థానంలో మెక్‌నీల్ నోరోన్హా!

**బలగం టీవి, న్యూఢిల్లీ**




ఐపీఎల్ 2026 సీజన్ ముగింపు దశకు చేరుకుంటున్న వేళ ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ ఒక కీలకమైన మార్పు చేసింది. జట్టులో వరుసగా ఆటగాళ్లు గాయాల బారిన పడుతుండటంతో మేనేజ్‌మెంట్ ఆందోళన చెందుతోంది. ఈ క్రమంలోనే గాయపడిన యువ పేసర్ రామకృష్ణ ఘోష్ స్థానంలో కర్ణాటకకు చెందిన పవర్‌ఫుల్ ఆల్ రౌండర్ మెక్‌నీల్ హాడ్లీ నోరోన్హాను జట్టులోకి తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. లీగ్ స్టేజ్‌లో ఇంకా మూడు మ్యాచ్‌లు మిగిలి ఉండగా, ప్లే ఆఫ్ రేసులో నిలవడానికి ఈ మార్పు ఎంతో కీలకం కానుంది. ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అరంగేట్రం చేసిన రామకృష్ణ ఘోష్, తన తొలి మ్యాచ్‌లోనే అద్భుతమైన డైవింగ్ క్యాచ్‌తో ఆకట్టుకున్నాడు. అయితే, బౌలింగ్ చేస్తున్న సమయంలో పాదం మడతపడటంతో అతడి కుడి పాదం ఫ్రాక్చర్ అయ్యింది. దీంతో ఈ సీజన్ మొత్తానికి అతడు దూరం కావలసి వచ్చింది. గెట్ వెల్ సూన్ రాంబో అంటూ సిఎస్కే తన సోషల్ మీడియాలో అతడికి వీడ్కోలు పలికింది.24 ఏళ్ల మెక్‌నీల్ నోరోన్హా కర్ణాటక క్రికెట్‌లో మంచి పేరు సంపాదించుకున్నాడు. ముఖ్యంగా 2025 మహారాజా ట్రోఫీలో మంగళూరు డ్రాగన్స్ తరపున ఆడి 253 పరుగులు చేయడంతో పాటు 10 వికెట్లు తీసి ఆల్ రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. అతడు కేవలం బ్యాటర్ మాత్రమే కాదు, మంచి ఆఫ్ స్పిన్నర్ కూడా. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలోనూ కర్ణాటక తరపున ఆడిన అనుభవం అతడికి ఉంది. సిఎస్కే సీఈఓ కాశీ విశ్వనాథన్ ఈ విషయాన్ని ధృవీకరిస్తూ.. బీసీసీఐ అనుమతి కోసం వేచి చూస్తున్నట్లు తెలిపారు. ఈ సీజన్ చెన్నైకి అస్సలు కలిసి రావడం లేదు. ఇప్పటికే కీలక బౌలర్ ఖలీల్ అహ్మద్, యువ బ్యాటర్ ఆయుష్ మాత్రే గాయాల వల్ల జట్టుకు దూరమయ్యారు. ఇక స్టార్ ప్లేయర్ ఎంఎస్ ధోనీ కూడా సీజన్ ఆరంభం నుంచి పిక్క కండరాల గాయంతో బాధపడుతున్నారు. నాథన్ ఎల్లిస్, స్పెన్సర్ జాన్సన్ వంటి విదేశీ ప్లేయర్లు కూడా పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ జట్టు ఎంపికలో సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో చెన్నై సూపర్ కింగ్స్ క్లిష్ట పరిస్థితిలో ఉంది. మిగిలిన మూడు మ్యాచ్‌లు గెలవడం జట్టుకు అత్యంత అవసరం. ఇలాంటి సమయంలో మెక్‌నీల్ నోరోన్హా వంటి ఆల్ రౌండర్ జట్టులోకి రావడం బలాన్ని ఇస్తుందని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అతడి హిట్టింగ్ సామర్థ్యం డెత్ ఓవర్లలో జట్టుకు ఉపయోగపడే అవకాశం ఉంది. కొత్త ప్లేయర్ తన అదృష్టాన్ని ఎలా పరీక్షించుకుంటాడో చూడాలి.



# ఐపీఎల్ 'సుల్తాన్' కోహ్లీ..

- చరిత్ర సృష్టించిన రన్ మెషీన్!
- ధోనీ, రోహిత్ రికార్డులు బ్రేక్.. అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా అగ్రస్థానం
- ఒకే జట్టు.. 19 ఏళ్ల ప్రయాణం: ఆర్‌సీబీ విధేయుడిగా సరికొత్త అధ్యాయం
- 9,040 పరుగులతో పరుగుల వేటలోనూ రారాజు
- 14 వేల టీ20 పరుగుల మైలురాయికి చేరువలో కింగ్ కోహ్లీ

**బలగం టీవి, రాయ్‌పూర్**

భారత క్రికెట్ దిగ్గజం, రన్ మెషీన్ విరాట్ కోహ్లీ ఐపీఎల్ చరిత్రలో మరో అరుదైన మైలురాయిని అధిగమించి చరిత్ర సృష్టించాడు. బుధవారం రాయ్‌పూర్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌తో కోహ్లీ సరికొత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా కింగ్ కోహ్లీ ఇప్పుడు అగ్రపీఠాన్ని అలంకరించాడు.

**ధోనీ, రోహిత్ రికార్డులు కనుమరుగు**

ఈ మ్యాచ్ ద్వారా విరాట్ కోహ్లీ తన కెరీర్‌లో 279వ ఐపీఎల్ మ్యాచ్‌ను పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో భారత క్రికెట్ దిగ్గజాలు ఎం.ఎస్. ధోనీ, రోహిత్ శర్మలను ఆయన అధిగమించాడు. ఇప్పటివరకు ధోనీ, రోహిత్ ఇద్దరూ చెరో 278 మ్యాచ్‌లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉండగా, కోహ్లీ 279వ మ్యాచ్‌తో వారిని వెనక్కి నెట్టి 'సుల్తాన్'గా అవతరించాడు. ధోనీ, రోహిత్ వేర్వేరు జట్ల తరపున ఈ ఫీట్ సాధించగా, కోహ్లీ కేవలం ఆర్‌సీబీ జెర్సీతోనే ఈ అరుదైన ఘనతను అందుకోవడం విశేషం.

**19 ఏళ్లు.. ఒకే టీమ్.. అకుంఠిత విధేయత**

2008లో ఐపీఎల్ ప్రారంభమైన నాటి నుంచి నేటి 2026 సీజన్ వరకు.. అంటే సుదీర్ఘమైన 19 ఏళ్ల పాటు కోహ్లీ ఆర్‌సీబీ జట్టుకే ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ప్రపంచ క్రికెట్‌లో అన్ని సీజన్లు ఒకే టీమ్ తరపున ఆడుతున్న ఏకైక ఆటగాడు కోహ్లీనే. ఈ 279 మ్యాచ్‌ల ప్రయాణం ఆర్‌సీబీ మరియు బెంగళూరు నగరం పట్ల ఆయనకు ఉన్న తిరుగులేని నిబద్ధతకు నిదర్శనం.

**గణాంకాల్లో 'కింగ్'**

కేవలం మ్యాచ్‌ల సంఖ్యలోనే కాకుండా, బ్యాటింగ్‌లోనూ కోహ్లీ రికార్డులు అజేయంగా ఉన్నాయి:
పరుగులు: 279 మ్యాచ్‌ల్లో 9,040 పరుగులతో ఐపీఎల్ టాప్ స్కోరర్‌గా కొనసాగుతున్నారు.
పోటీ: పరుగుల వేటలో కోహ్లీ తర్వాత రోహిత్ శర్మ (7,289), ధోనీ (5,439) ఉన్నారు.
బౌలింగ్: బ్యాటింగ్‌తోనే కాకుండా బంతితోనూ మెరిసి ఇప్పటివరకు 4 వికెట్లు పడగొట్టాడు.

**14 వేల పరుగుల దిశగా..**

కోహ్లీ తన టీ20 కెరీర్‌లో (అంతర్జాతీయ, డొమెస్టిక్ కలిపి) ఇప్పటివరకు 426 మ్యాచ్‌ల్లో 13,922 పరుగులు సాధించాడు. టీ20 ఫార్మాట్‌లో 14,000 పరుగుల మైలురాయిని చేరుకోవడానికి ఆయనకు కేవలం 78 పరుగులు మాత్రమే అవసరం. ఈ ఘనత సాధిస్తే టీ20 చరిత్రలో ఈ మార్కును అందుకున్న తొలి భారతీయ బ్యాటర్‌గా కోహ్లీ సరికొత్త చరిత్ర లిఖిస్తాడు.

# అగ్రస్థానానికి చేరుకున్న రబడ

**బలగం టీవి, న్యూఢిల్లీ**



ఐపీఎల్ 2026 సీజన్‌లో సౌతాఫ్రికా స్పీడ్‌స్టర్ కగిసో రబడ తన ప్రతాపాన్ని కొనసాగిస్తున్నాడు. అహ్మదాబాద్ వేదికగా మంగళవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో రబడ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో ప్రత్యర్థి టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. ఈ మ్యాచ్‌లో తన కోటా 4 ఓవర్లలో కేవలం 28 పరుగులు మాత్రమే ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. ముఖ్యంగా కొత్త బంతితో రబడ వేసిన స్పెల్ ఈ సీజన్‌లోనే అత్యంత ప్రమాదకరమైనదిగా నిలిచింది. పవర్‌ప్లేలోనే అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, స్మరణ్ రవిచంద్రన్ వంటి కీలక బ్యాటర్లను పెవిలియన్ పంపి హైదరాబాద్ టీమ్‌ను కోలుకోలేని దెబ్బ తీశాడు. ఈ అదిరిపోయే ప్రదర్శనతో రబడ ఐపీఎల్ చరిత్రలో ఒక అరుదైన మైలురాయిని చేరుకున్నాడు. ఈ సీజన్ పవర్‌ప్లే ఓవర్లలో రబడ ఇప్పటివరకు మొత్తం 16 వికెట్లు సాధించాడు. తద్వారా ఒకే ఐపీఎల్ సీజన్ పవర్‌ప్లేలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో మిచెల్ జాన్సన్ (2013), ట్రెంట్ బౌల్ట్ (2020) రికార్డులను సమం చేశాడు. ప్రస్తుతం రబడ కంటే ముందు కేవలం మహమ్మద్ షమీ మాత్రమే ఉన్నాడు. షమీ 2023 సీజన్‌లో పవర్‌ప్లేలో 17 వికెట్లు పడగొట్టి టాప్‌లో ఉన్నాడు. రబడ ప్రస్తుత ఫామ్ చూస్తుంటే ఈ రికార్డును బ్రేక్ చేయడం పెద్ద కష్టమేమీ కాదనిపిస్తోంది. ప్రస్తుత 2026 సీజన్ పవర్‌ప్లే వికెట్ల చార్ట్‌లో కూడా రబడ అందరికంటే చాలా ముందున్నాడు. రబడ 16 వికెట్లతో అగ్రస్థానంలో ఉండగా, భువనేశ్వర్ కుమార్ 12 వికెట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. జోఫ్రా ఆర్చర్, మహమ్మద్ సిరాజ్ చెరో 9 వికెట్లతో తర్వాత స్థానాల్లో ఉన్నారు. రబడ ఎకానమీ కొంచెం ఎక్కువగా ఉన్నప్పటికీ, వికెట్లు తీయడంలో మాత్రం తనదైన మార్క్ చూపిస్తున్నాడు. వికెట్లు తీయడం వల్ల ప్రత్యర్థి టీమ్ రన్ రేట్‌ను కంట్రోల్ చేయడంలో రబడ సక్సెస్ అవుతున్నాడు. ఈ మ్యాచ్‌లో రబడ దెబ్బకు సన్‌రైజర్స్ బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకోవడానికి చాలా ఇబ్బంది పడ్డారు. పవర్‌ప్లే ముగిసేసరికి హైదరాబాద్ స్కోరు కేవలం 34/4 మాత్రమే. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్‌కు ఇది రెండో అత్యల్ప పవర్‌ప్లే స్కోరు కావడం గమనార్హం. అలాగే పవర్‌ప్లేలోనే 4 వికెట్లు కోల్పోవడం హైదరాబాద్ టీమ్‌కు ఈ సీజన్‌లో ఇదే మొదటిసారి. అంతకుముందు గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లు సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్ హాఫ్ సెంచరీలతో రాణించి తమ జట్టుకు 168 పరుగుల గౌరవప్రదమైన స్కోరు అందించారు. ఆ తర్వాత టార్గెట్ ఛేజింగ్‌లో సన్‌రైజర్స్ సెటిల్ అవ్వకుండా రబడ ఆరంభం నుండే ఒత్తిడి పెంచాడు. ముందుగా అభిషేక్ శర్మను ఎక్స్‌ట్రా పేస్ ఇంకా బౌన్స్‌తో అవుట్ చేసిన రబడ, ఆ వెంటనే ఇషాన్ కిషన్‌ను తన ట్రాప్‌లో పడేసాడు. తన స్పెల్ మధ్యలో స్మరణ్ రవిచంద్రన్‌ను కూడా అవుట్ చేసి హైదరాబాద్ అగ్రెసివ్ బ్యాటింగ్ లైనప్‌ను కకావికలం చేసాడు. ఈ సీజన్ అంతటా రబడ తన రా పేస్, అక్యురేట్ లెంగ్త్‌తో బ్యాటర్లను భయపెడుతున్నాడు. పిచ్ ఎలాంటిదైనా సరే తన బౌలింగ్‌తో వికెట్లు రాబట్టడం రబడకు వెన్నతో పెట్టిన విద్య. గుజరాత్ టైటాన్స్ దగ్గర ఐపీఎల్‌లోనే అత్యంత పవర్‌ఫుల్ పేస్ అటాక్ ఎందుకు ఉందో రబడ మరోసారి నిరూపించాడు.

# ఫేక్ న్యూస్‌పై నిప్పులు చెరిగిన ప్రీతి జింటా

**బలగం టీవి, న్యూఢిల్లీ**



ఐపీఎల్ 2026 సీజన్ క్లైమాక్స్‌కు చేరువవుతున్న వేళ మైదానంలో ఆట కంటే బయట జరుగుతున్న ప్రచారమే ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా పంజాబ్ కింగ్స్ జట్టులో విభేదాలు ఉన్నాయని, ప్లేయర్ల మధ్య సమన్వయం లోపించిందంటూ వస్తున్న వార్తలపై ఆ జట్టు సహ యజమాని, బాలీవుడ్ నటి ప్రీతి జింటా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియాలో తన జట్టు పరువు తీసేలా అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదని ఆమె గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఈ ఏడాది ఐపీఎల్ టోర్నీని పంజాబ్ కింగ్స్ అద్భుతంగా ప్రారంభించింది. వరుస విజయాలతో పాయింట్ల పట్టికలో టాప్‌లో నిలిచిన ఈ జట్టు, గత నాలుగు మ్యాచ్‌ల్లో వరుస ఓటములను చవిచూసింది. దీంతో ఒక్కసారిగా సమీకరణాలు మారిపోయాయి. ఇప్పటివరకు ఆడిన 11 మ్యాచ్‌ల్లో 6 విజయాలతో నాలుగో స్థానంలో ఉన్నప్పటికీ, తదుపరి మ్యాచ్‌లు ఆ జట్టుకు చావో రేవో లాంటివి. ఈ క్లిష్ట సమయంలో జట్టులో క్రమశిక్షణ లేదని, వ్యూహాలు ఫలించడం లేదని సోషల్ మీడియాలో విమర్శలు మొదలయ్యాయి.తన జట్టుపై వస్తున్న ట్రోల్స్, రూమర్లపై ప్రీతి జింటా సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "గేమ్ గురించి చర్చలు చేయడం, విమర్శించడం సహజమే. కానీ ఉద్దేశపూర్వకంగా మా ఆటగాళ్ల పరువుకు భంగం కలిగించేలా కథనాలు సృష్టించడం కరెక్ట్ కాదు. బాధ్యతాయుతమైన మీడియా సంస్థలు నిరాధారమైన వార్తలను వ్యాప్తి చేయవద్దని కోరుతున్నాను" అంటూ ఆమె అసహనం వ్యక్తం చేశారు. కేవలం పాపులారిటీ కోసం జట్టు ప్రతిష్టను దెబ్బతీయడం సరికాదని ఆమె హితవు పలికారు. కేవలం ప్రీతి జింటా మాత్రమే కాకుండా, పంజాబ్ కింగ్స్ మేనేజ్మెంట్ కూడా ఈ విషయంపై ఘాటుగా స్పందించింది. సరదా సంభాషణలు, అభిప్రాయాలను తాము గౌరవిస్తామని, కానీ చౌకబారు పబ్లిసిటీ కోసం అబద్ధాలు చెబితే ఊరుకోమని స్పష్టం చేసింది. ఆటగాళ్ల మధ్య గొడవలు ఉన్నాయంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని ఫ్రాంచైజీ తేల్చి చెప్పింది. అన్ని వివాదాలను పక్కన పెట్టి ఇప్పుడు పంజాబ్ జట్టు ధర్మశాల వేదికగా గురువారం ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ పంజాబ్ కింగ్స్‌కు అత్యంత కీలకం. ఇందులో గెలిస్తేనే ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంటాయి. ఒకవేళ ఓడిపోతే మాత్రం టోర్నీ నుంచి నిష్క్రమించే ప్రమాదం ఉంది. మరి ఈ ఒత్తిడిని తట్టుకుని పంజాబ్ ప్లేయర్లు ఎలా రాణిస్తారో చూడాలి.

# మసూద్ కెప్టెన్సీపై పెద్ద ఎత్తున విమర్శలు

## బాబర్‌కు మళ్లీ కెప్టెన్సీ పగ్గాలు ఇచ్చే చాన్స్!

**బలగం టీవి, న్యూఢిల్లీ**

ఢాకా వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన మొదటి టెస్టులో పాకిస్థాన్ 104 పరుగుల తేడాతో అవమానకరమైన ఓటమిని చవిచూసింది. ఈ ఓటమి పాక్ క్రికెట్ వర్గాల్లో తీవ్ర కలకలం సృష్టించింది. ముఖ్యంగా కెప్టెన్ షాన్ మసూద్ కెప్టెన్సీపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. 2023 డిసెంబర్‌లో కెప్టెన్సీ చేపట్టిన మసూద్.. ఇప్పటివరకు తాను సారథ్యం వహించిన 15 మ్యాచ్‌ల్లో 11 ఓటములను చూడటం గమనార్హం. కేవలం కెప్టెన్సీలోనే కాకుండా, బ్యాటింగ్‌లో కూడా అతను ఘోరంగా విఫలమవ్వడం జట్టు యాజమాన్యాన్ని అసహనానికి గురిచేస్తోంది.జట్టును గాడిలో పెట్టేందుకు పీసీబీ మళ్లీ బాబర్ ఆజం వైపు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. మోకాలి గాయం కారణంగా మొదటి టెస్టుకు దూరమైన బాబర్.. మే 18 నుంచి ప్రారంభమయ్యే రెండో టెస్టుకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

# విడాకుల జాబితాలో మరో నటి



## భర్తను అన్ ఫాలో చేసిన మౌనీరాయ్

నటి మౌనీరాయ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక వార్త కొన్ని రోజులుగా నెట్టింట వైరల్ అవుతోంది. భర్త సూరజ్ నంబియార్‌తో ఆమె విడిపోతున్నట్లు నెట్టింట ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ వార్తలకు బలం చేకూర్చేలా ఇన్‌స్టాగ్రామ్‌లో వీరిద్దరూ ఒకరికొకరు అన్‌ఫాలో చేసుకున్నారు. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మౌనీ రాయ్ తనకు సంబంధించిన విషయాలను పంచుకుంటూ టూర్స్ ఫొటోలను షేర్ చేస్తుంటారు. కొన్ని రోజులుగా భర్తతో ఉన్న ఫొటోలు పోస్ట్ చేయలేదు. మరోవైపు సూరజ్ నంబియార్ ఇన్‌స్టాలో పెళ్లి ఫొటోలు కూడా కనిపించడం లేదు. అలాగే రూమర్స్‌ను ఇద్దరూ ఖండించకపోవడంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. 2022 జనవరిలో తన ప్రియుడు సూరజ్ నంబియార్‌ను మౌనీరాయ్ గోవాలో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. సినిమాల విషయానికొస్తే.. మౌనీరాయ్ 'విశ్వంభర'లో ఓ స్పెషల్ సాంగ్ చేసినట్లు సమాచారం. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. చిరంజీవి సూపర్ హిట్ సినిమా 'ఖైదీ'లోని రగులుతోంది మొగలిపొద.. పాట రీమేక్‌కు మౌనీరాయ్‌తో కలిసి చిరు మరోసారి మెస్మరైజ్ చేయనున్నట్లు తెలుస్తోంది.

# కమల్-రజనీ మూవీలో త్రిష




తమిళనాడులో ఎన్నికల సందడి మొదలు... గత కొన్ని రోజులుగా త్రిష పేరు మార్మోగి పోతోంది. ముఖ్యమంత్రిగా తమిళ సూపర్‌స్టార్ విజయ్ ప్రమాణ స్వీకారోత్సవంలోనూ త్రిష ప్రధాన ఆకర్షణగా నిలిచారు. తమిళనాడు రాజకీయాల్లోకి ఆమె కూడా ప్రవేశిస్తారన్న ప్రచారం సామాజిక మాధ్యమాల్లో మొదలైంది. అయితే ఆమె వరుస సినిమాలతో సందడి చేయబోతోంది. మరోవైపు కొత్త ప్రాజెక్టుల విషయం లోనూ ఆమె పేరు బలంగా వినిపి స్తోంది. రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి చేయనున్న సినిమాలోనూ త్రిష కథానాయికగా నటించనున్నట్టు సమాచారం. నాలుగున్నర దశాబ్దాల తర్వాత రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆ సినిమాలోనే త్రిష ఓ కథానాయికగా నటించనున్నట్టు తెలుస్తోంది. అదే నిజమైతే ఈ కలయిక మరింత ప్రత్యేకం కానుంది. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన అనంతరం ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు త్రిష. ప్రేమ ఎప్పుడూ గట్టిగానే వినిపిస్తుంది... అనే వ్యాఖ్యని జోడిస్తూ, తన ముస్తాబు వెనకున్న తన బృందానికి కృతజ్ఞతలు చెప్పింది.

# ఎన్టీఆర్ -నీల్ ప్రాజెక్ట్ మూవీ




## మే 19న అర్ధరాత్రి గ్లింప్స్ విడుదల

జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఎన్టీఆర్-నీల్' ప్రాజెక్ట్ నుంచి అదిరిపోయే అప్డేట్ రాబోతోంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా కెజిఆఎఫ్, 'సలార్' సినిమాలతో తనకంటూ ప్రత్యేకమైన మాస్ యూనివర్స్‌ను సృష్టించిన ప్రశాంత్ నీల్, ఇప్పుడు తారక్‌ను ఎలా చూపించబోతున్నాడోననే ఆసక్తి అభిమానుల్లో రోజురోజుకీ పెరుగుతోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్‌ను తారక్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. దీంతో మే 20న అభిమానులకు భారీ ట్రీట్ ఖాయమని అందరూ భావించారు. అయితే ఇప్పుడు తాజా సమాచారం ప్రకారం, అభిమానుల ఉత్కంఠను మరింత పెంచేలా మేకర్స్ ఒక రోజు ముందుగానే గ్లింప్స్‌ను రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట. అంటే మే 19 అర్ధరాత్రి 12 గంటలకే ఈ ఫస్ట్ గ్లింప్స్ విడుదల కానున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. అర్ధరాత్రి నుంచే సోషల్ మీడియాలో తారక్ ఫ్యాన్స్ సంబరాలు మొదలయ్యే అవకాశముంది. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన చిన్న చిన్న లీక్స్, సెట్స్ ఫోటోలు అభిమానుల్లో భారీ హైప్ తీసుకొచ్చాయి. ఇప్పుడు ఫస్ట్ గ్లింప్స్‌తో ప్రశాంత్ నీల్ సృష్టించిన కొత్త ప్రపంచం ఎలా ఉండబోతుందో చూడాలని సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు మే 18న రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' ట్రైలర్ విడుదల కానుండటంతో సోషల్ మీడియాలో ఇప్పటికే మెగా అభిమానుల హంగామా మొదలైంది. ఇక దానికి మరుసటి రోజే తారక్ గ్లింప్స్ రావడంతో మెగా-నందమూరి అభిమానుల మధ్య సోషల్ మీడియా వార్ పీక్స్‌కు చేరుతుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాను 2027 జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. తారక్ నుంచి వస్తున్న ఈ భారీ సోలో ప్రాజెక్ట్ కావడంతో ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇక మే 19 అర్ధరాత్రి విడుదలయ్యే గ్లింప్స్‌లో తారక్ లుక్, క్యారెక్టర్, సినిమా బ్యాక్‌డ్రాప్‌పై క్లారిటీ వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు.




# వరుస ఫ్లాపులతో ముందు జాగ్రత్త




## రెమ్యూనరేషన్ భారీగా తగ్గించుకున్న రవితేజ

మాస్ మహారాజా రవితేజ గత కొంతకాలంగా బాక్సాఫీస్ వద్ద సరైన విజయాన్ని అందుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు వరుస హిట్లతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక మార్కెట్‌ను సృష్టించుకున్న రవితేజ, ఇప్పుడు వరుస పరాజయాలతో కెరీర్‌లో వైఫల్య దశను ఎదుర్కొంటున్నారు. ఇటీవల విడుదలైన సినిమాలు ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోకపోవడంతో, ఆయన తన తదుపరి ప్రాజెక్టుల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇప్పటివరకు కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌తో ప్రేక్షకులను అలరించిన రవితేజ, ఇప్పుడు మార్కెట్ పరిస్థితులను బట్టి తన నిర్ణయాల్లో మార్పులు చేస్తున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా రెమ్యూనరేషన్ విషయంలో ఆయన తీసుకున్న తాజా నిర్ణయం చిత్రసీమలో హాట్ టాపిక్‌గా మారింది. ఒకప్పుడు సినిమా కోసం రూ.25 కోట్ల వరకు పారితోషికం తీసుకున్న రవితేజ, ప్రస్తుతం తన రెమ్యూనరేషన్‌ను రూ.15 కోట్లకు తగ్గించుకున్నారని ప్రచారం. నిర్మాతలపై అదనపు భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. వరుస డిజాస్టర్ల తర్వాత మార్కెట్‌లో తన స్థాయిని మళ్లీ నిలబెట్టుకోవాలంటే ముందుగా మంచి విజయాన్ని అందుకోవాల్సిన అవసరం ఉందని రవితేజ భావిస్తున్నారట. అందుకే ప్రస్తుతం కథల ఎంపికలో కూడా ఆయన చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ప్రస్తుతం రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి' పై ఇండస్ట్రీలో మంచి ఆసక్తి నెలకొంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా రవితేజ కెరీర్‌లో పూర్తిగా భిన్నమైన ప్రయత్నంగా చెబుతున్నారు. ఇప్పటివరకు ఎక్కువగా మాస్, కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్స్ చేసిన రవితేజ, ఈసారి థ్రిల్లర్ జానర్‌ను ఎంచుకోవడం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. 'ఇరుముడి' సినిమా కథ, ట్రీట్‌మెంట్, రవితేజ పాత్ర పూర్తిగా కొత్తగా ఉండబోతున్నాయని సమాచారం. ఈ సినిమా విజయమే ఇప్పుడు ఆయన కెరీర్‌కు చాలా కీలకంగా మారింది. ఒకవేళ ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధిస్తే రవితేజ మళ్లీ ఫామ్‌లోకి రావడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.






# శ్రీనివాస మంగాపురం సెకండ్ సింగిల్ ప్రోమో

మంగళవారం సినిమా హిట్ తరువాత అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తోన్న చిత్రాల్లో శ్రీనివాస మంగాపురం ఒకటి. ఘట్టమనేని వారసుడు జయకృష్ణ హీరోగా పరిచయమవుతోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ భామ రవీనా టాండన్ కుమార్తె రషా తడానీ హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, సాంగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాను వైజయంతీ మూవీస్ బ్యానర్ పై అశ్వినీదత్ సమర్పించడం మరింత బజ్ ని క్రియేట్ చేసింది. తాజాగా శ్రీనివాస మంగాపురం నుంచి సెకండ్ సింగిల్ ప్రోమోను మేకర్స్ రిలీజ్ చేశారు. మంగా మంగా అంటూ సాగే ఈ సాంగ్ ఆద్యంతం ఆకట్టు కొంటుంది. తిరుపతిలో జరిగే ప్రేమకథగా శ్రీనివాస మంగాపురం తెరకెక్కుతోంది. కొత్తగా తిరుపతి కొచ్చిన కుర్రోళ్ళని బతకనివ్వరా..? అన్నదమ్ములు లేరా మీకు? అంటూ హీరో.. హీరోయిన్ అందాన్ని చూసి మైమరచిపోయి.. ఆమెపై ఉన్న ప్రేమ భావాలను తెలిపుతున్నట్లు లిరిక్స్ వింటుంటే అర్ధమవుతోంది.జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ సాంగ్ కి కాసర్ల శ్యామ్ లిరిక్స్ అందించాడు. ఇక రేవంత్ తన వాయిస్ తో ఈ సాంగ్ ని నెక్స్ట్ లెవెల్ కి తీసుకెళ్లాడు. జయకృష్ణ క్యూట్ స్టెప్స్, మాస్ లుక్, రషా అందం, విజువల్స్ అదిరిపోయాయి. మే 13 న ఫుల్ సాంగ్ ను రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం షూటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రం త్వరలోనే రిలీజ్ కి సిద్ధమవుతోంది.

